



పెదపారుపూడి మండలం వానపాముల చిన్న వంతెన వద్ద ఈ ఏడాది ఫిబ్రవరి 5న ట్రాక్టర్ బోల్తా పడటంతో నిలిచిపోయిన ట్రాఫిక్

ఎన్నాళ్లీ నరకం

గుడివాడ-విజయవాడ రోడ్డు గుంతలమయం

- వరుస ప్రమాదాలతో బెంబేలెత్తిపోతున్న వాహనదారులు
- ఐదేళ్లలో 50 మంది మృతి.. వందలాది మందికి గాయాలు
- కూటమి ప్రభుత్వం వచ్చాక రోడ్డుకు మరమ్మతులు
- పూర్తిస్థాయిలో రోడ్డును అభివృద్ధి చేయాలని ప్రజల విజ్ఞప్తి

గుడివాడ-కంకిపాడు రహదారి అడుగుకో గుంతతో అధ్వానంగా తయారైంది. నిత్యం జరుగుతున్న ప్రమాదాలతో వాహనచోదకులు వణికిపోతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో రోడ్డు గుంతలు పూడ్చకపోవడం వల్ల ఐదేళ్లలో అనేక ప్రమాదాలు జరిగాయి. సుమారు 50 మంది వరకు మృత్యువాత పడ్డారు. వందలాది మంది ఆస్పత్రిపాలయ్యారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రోడ్డు మరమ్మతులపై దృష్టి సారించింది. అయితే పూర్తిస్థాయిలో రోడ్డును అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

6లో

జిల్లా పరిషత్‌లో పాలన గాడి తప్పింది. ఇటీవల జిల్లాకు వచ్చిన కీలక అధికారి వ్యవహార శైలితో అధికారులు, ఉద్యోగులు హడలిపోతున్నారు. ఆయన చాంబర్‌లోకి వెళితే ఎలాంటి అవమానకర పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందోనని వణికిపోతున్నారు. అధికారుల హోదా, ఉద్యోగుల సీనియారిటీని సైతం లెక్కచేయకుండా తిట్లదండకం అందుకోవడంతో వారు ఖిన్నులైపోతున్నారు. ప్రజా సమస్యల పరిష్కారంపై గతంలో ఇలా చేశాం అంటూ సలహా ఇచ్చేందుకు ప్రయత్నిస్తే ఇక చాలు.. నేను చెప్పినట్లు చేయండి అంటూ ఆదేశాలు ఇస్తున్నారు. రిటైర్డ్ ఉద్యోగుల ఫైల్స్ క్లియర్ చేయకుండా నెలల తరబడి పెట్టుకోవడంతో వారు కార్యాలయం చుట్టూ తిరిగలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. బదిలీల్లోనూ మొండిగా వ్యవహరించడంతో ఉద్యోగులు కుమిలిపోతున్నారు.



జిల్లా పరిషత్ కార్యాలయం

- అధికారులు, ఉద్యోగులను కించపరిచేలా వ్యాఖ్యలు
- బదిలీ కోరినా, సిఫార్సు లేఖ తెచ్చినా తిట్ల దండకం
- విశ్రాంత ఉద్యోగుల ఫైల్స్ క్లియర్ చేయకుండా పెండింగ్
- ఎవరికి చెప్పుకోవాలో తెలియక అధికారులు, ఉద్యోగుల అవస్థలు

హిట్లర్!



జిల్లా పరిషత్‌లో కీలక అధికారి వ్యవహారశైలిపై విమర్శలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: ఉమ్మడి కృష్ణాజిల్లాలో 49 మండలాలు, జెడ్పీ పాఠశాలలకు సంబంధించిన పరిపాలనా వ్యవహారాలన్నీ జిల్లా పరిషత్ నేతృత్వంలోనే కొనసాగుతాయి. ఇటీవల కాలంలో అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడేవారు, పిల్లల చదువుల నిమిత్తం, ఇంటిలోని పెద్దల ఆరోగ్య సమస్యలు తదితర కారణాలతో ఉద్యోగులు ఖాళీగా ఉన్న అనువైన ప్రాంతంలో తమను డిప్యుటేషన్ లేదా ఇతరత్రా మార్గాల్లో బదిలీ చేయాలని కోరుతున్నారు. శాసన సభ్యులు, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధుల ద్వారా సిఫార్సు లేఖలను కూడా ఉద్యోగులు తెచ్చుకున్నారు. ఈ లేఖలను జిల్లా పరిషత్‌లోని కీలక అధికారికి అందజేశారు. దీనిపై ఆగ్రహంతో రగిలిపోయిన సదరు అధికారి ఎంపీడీవోలతో ఇటీవల జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయాల్లో, జిల్లా పరిషత్ పాఠశాలల్లో పనిచేసే సిబ్బంది ఎవరైనా తమను బదిలీ చేయాలని సిఫార్సు లేఖలు తెస్తే, వారి సంగతి చూస్తానంటూ బెదిరింపు ధోరణితో మాట్లాడారు. ఎంపీడీవోలు ఈ విషయంలో జోక్యం చేసుకుని ఇలాంటి వ్యవహారాలు తన వద్దకు తీసుకురావద్దంటూ చెప్పకనే చెప్పారు. దీంతో అధికారులు ఖంగుతిన్నారు. ఉద్యోగులకు కొన్ని ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఉంటాయని, తీవ్ర ఇబ్బందులు పడే ఒకరిద్దరికైనా మానవతా దృక్పథంతో వెసులుబాటు ఇవ్వవచ్చని, అలా కాకుండా తన వద్దకు సిఫార్సు లేఖలు తెచ్చిన వారికి శంకరగిరిమాన్యాలు పట్టిస్తాననే ధోరణిలో హెచ్చరికలు జారీ చేయడంతో అధికారులు తమ వద్ద పనిచేసే ఉద్యోగులకు ఏం చెప్పాలో తెలియక, ఉన్నతాధికారికి చెప్పలేక సతమతమవుతున్నారు.

అధికారులను కించపరిచేలా వ్యవహారశైలి..

జిల్లా పరిషత్‌లోని వివిధ విభాగాల్లో సీనియర్ అధికారులు ఉన్నారు. గతంలో పనిచేసి ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిన కీలక అధికారులతో తమకు ఉన్న పరిచయాల కారణంగా ప్రస్తుతం పనిచేస్తున్న కీలక అధికారితోనూ ఇదే ధోరణిలో మాట్లాడుతున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా సరిహద్దున ఉన్న ఒక మండల పరిషత్ కార్యాలయంలో పనిచేసే సీనియర్ అధికారికి ఇటీవల ఈ కీలక అధికారి ఫోన్‌చేశారు.

ఆయనతో ఫోన్‌లో మాట్లాడిన అనంతరం సదరు అధికారిని తన చాంబరుకు పిలిపించారు. ఎంతో సీనియారిటీ ఉన్న ఈ అధికారి ఎలాంటి అరమరికలు లేకుండా పరిపాలనాపరమైన అంశాలపై మాట్లాడారు. దీంతో ఆగ్రహానికి గురైన సదరు కీలక అధికారి ఉన్నతాధికారితో మాట్లాడే విధానం ఇలాగేనా అంటూ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తూ అవమానకరంగా మాట్లాడినట్లు తెలిసింది. ఇటీవల కాలంలో ఇదే ఒరవడిని కొనసాగిస్తూ నలుగురైదుగురు అధికారులను తన చాంబరుకు పిలిచి అవమానకరంగా మాట్లాడారని అధికారులు చెబుతున్నారు. జిల్లా పరిషత్‌లో కొన్ని రోజులుగా ఈ అంశం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కీలక అధికారి మాటతీరు, తాను చెప్పినట్లుగానే వినాలనే ధోరణితో ఉద్యోగులు, అధికారులు సతమతమవుతున్నట్లు పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా పరిషత్‌లో జరిగే అంతర్గత సమావేశాల్లో జరిగే చర్చల్లో వివిధ సమస్యలు, వాటికి పరిష్కార మార్గాలపై అధికారులు సిబ్బంది చొరవతీసుకుని చెబితే, మీకేం తెలియదు.. మీరు చెప్పినట్లుగా జరగడానికి వీల్లేదు.. నేను మిగతా 6లో..



దేదీప్యం

వీరమ్మ తిరునాళ్ల ప్రారంభం

- సారె సమర్పించిన పట్టణ పోలీసులు
- అమ్మవారిని పల్లకీలో కూర్చుండబెట్టిన మంత్రి కొలుసు పార్థసారథి
- ఎదురుగండ దీపాలు, తిరుగండ దీపాలతో తరలివచ్చిన భక్తజనం

ఉయ్యూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): వీరమ్మ తల్లి తిరునాళ్ల అంగరంగ వైభవంగా శనివారం ప్రారంభమయ్యాయి. అమ్మవారికి ఉయ్యూరు పట్టణ పోలీసులు సంప్రదాయ బద్ధంగా పసుపు కుంకుమలతో సారెను సమర్పించారు. గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యే బోడె ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్, ఉయ్యూరు మున్సిపల్ చైర్మన్ వి.సత్యనారాయణ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి విగ్రహాన్ని మంత్రి సారథి తీసుకువచ్చి పల్లకీలో కూర్చుండబెట్టారు. మేళతాళాలు, డప్పువాయిద్యాల నడుమ వేలాది మంది ఎదురుగండ దీపాలు అందుకుని, తిరుగండ దీపాల భక్తులు వెంటరాగా, అమ్మవారు ఊరేగింపుగా బయలుదేరారు. అమ్మవారికి గండదీపాలు ఇచ్చేందుకు వేలాదిగా భక్తులు తరలిరావడంతో పట్టణం జనసంద్రంగా మారింది. రాత్రంతా పట్టణంలో ఊరేగి ఆదివారం ఊయల ఉత్సవం జరుపుని సాయంత్రం ప్రధాన రహదారిపై ఉన్న ప్రధాన ఆలయానికి చేరుకుని తిరునాళ్లలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. 15 రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో అవాంచనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

గండదీపాల వెలుగులో ఉయ్యూరు వీరమ్మ తల్లి పల్లకీ ఉత్సవం



అమ్మవారిని పల్లకీ వద్దకు తీసుకొస్తున్న మంత్రి సారథి



పల్లకీలో ఊరేగుతున్న వీరమ్మ తల్లి



గండదీపాలతో భక్తులు



విద్యుత్ దీపాల వెలుగులో గుణదల మేరీమాత కొండ

నిష్కళంక మాతకు వందనం

- నేటి నుంచి గుణదల మేరీమాత తిరునాళ్ల
- దక్షిణ భారతదేశంలోనే రెండో అతి పెద్ద క్రైస్తవ పుణ్యక్షేత్రం
- 1924లో స్వయం సిద్ధిగా కొండలో వెలిసిన మరియ మాత
- మూడు రోజుల పాటు ఘనంగా ఉత్సవాలు

8

ఎన్‌హెచ్‌కు షాక్!



ల్యాంకో లిక్విడేటర్ నుంచి ఎన్‌హెచ్‌కు ఘాటు లేఖ

- ల్యాంకో యజమాని ఎవరన్నదానిపై స్పష్టత
- రాధా వాసవి అసెట్స్‌కు సంబంధం లేదని వెల్లడి
- ఆ సంస్థకు డబ్బు చెల్లిస్తే తమకు సంబంధం లేదని స్పష్టీకరణ
- ఇప్పటికే రూ.14 కోట్ల వరకూ చెల్లించేసిన ఎన్‌హెచ్
- మరోసారి వివాదంలోకి వెస్ట్ బైపాస్ విద్యుత్ టవర్ల మార్పిడి

విజయవాడ వెస్ట్ బైపాస్ రోడ్డుకు సంబంధించి ల్యాంకో ట్రాన్స్‌మిషన్ హైటెన్షన్ టవర్ల మార్పిడి విషయంలో కోరి వివాదాన్ని తెచ్చుకున్న జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్) చివరికి చిక్కుల్లో పడింది. ల్యాంకో హైటెన్షన్ పవర్ లైన్స్ అసలు యాజమాన్యం ఎవరనేది ధ్రువీకరించాల్సిందిగా ల్యాంకో లిక్విడేటర్‌కు ఎన్‌హెచ్ అధికారులు లేఖ రాసిన నేపథ్యంలో ఆయన మెయిల్ ద్వారా పంపిన సమాధానానికి షాకైంది. సంబంధం లేని ఓ సంస్థకు అప్పనంగా రూ.14 కోట్లు చెల్లించడం తప్పు అని సదరు మెయిల్ ద్వారా తెలుసుకున్న ఎన్‌హెచ్ అధికారులు చివరికి తలలు పట్టుకున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ వెస్ట్ బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేయబోయే ల్యాంకో ట్రాన్స్‌మిషన్ హైటెన్షన్ టవర్ లైన్స్ యాజమాన్యం ఎవరన్న ప్రశ్నకు చిక్కుముడి వీడింది. ఈ విషయంపై సదరు సంస్థ.. జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్)కు స్పష్టతనిచ్చింది.

జరిగింది ఇదీ..

కొండపల్లిలోని ల్యాంకో పవర్ ప్రాజెక్టు ఆర్థిక నష్టాలతో దివాలా తీసింది. దీనిపై నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)లో ఐపీ పిటిషన్ కూడా వేసింది. స్పందించిన జాతీయ లా ట్రిబ్యునల్.. ల్యాంకో పవర్ ప్రాజెక్టుకు రిజిస్టర్ ఇన్‌సాల్వెన్సీ ప్రొఫెషనల్ అయిన పంకజ్ ధనూకా అనే వ్యక్తిని లిక్విడేటర్‌గా నియమించింది. ఇతని బాధ్యత ఏంటంటే.. ల్యాంకో పవర్ ప్రాజెక్టు యాజమాన్యం ఎవరెవరికి అప్పులు ఉందో తెలుసుకుని, కోర్టు ద్వారా వాటి ఆస్తులు అమ్మి, అప్పులు తీర్చడం. తమకు న్యాయం చేయాలని జక్కంపూడి, నైనవరం రైతులు హైకోర్టును ఆశ్రయించిన క్రమంలో కోర్టు విచారణ సందర్భంగా ల్యాంకోకు లిక్విడేటర్ ఉన్న అంశం వెలుగులోకి వచ్చింది. ఈ విషయం ఎప్పుడైతే తెరపైకి వచ్చిందో తాము తొందరపడ్డామని ఎన్‌హెచ్‌కు అర్థమైంది.

ఎన్‌హెచ్ ఏం చేసిందంటే..

విజయవాడ వెస్ట్ బైపాస్ రోడ్డులో పవర్‌లైన్స్ అలైన్‌మెంట్ మార్పునకు ఎప్పుడో మూతపడిన ప్రాజెక్టుకు ఎన్‌హెచ్ అప్పట్లో గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అంతేకాదు.. సూపర్ వైజేషన్ చార్జీలు రూ.35 లక్షలు, హైటెన్షన్ విద్యుత్ తీగలకు విద్యుత్ అంతరాయం పేరుతో రూ.14 కోట్లు ల్యాంకోను టేకోవర్ చేసుకున్నట్టుగా చెప్పుకొంటున్న రాధా వాసవీ అసెట్స్ అనే సంస్థకు చెల్లించింది. ఈ అంశం వివాదాస్పదమైంది. దీనిపై రైతులు హైకోర్టుతో పాటు జాతీయ స్థాయిలో ఫిర్యాదు చేశారు. వీటిపై కోర్టు విచారణలు, కేంద్ర విజిలెన్స్ బృందం విచారణ నేపథ్యంలో జాతీయ రహదారుల సంస్థ.. ల్యాంకో పవర్‌లైన్స్‌కు యాజమాన్య ధ్రువీకరణ కోసం లిక్విడేటర్‌కు లేఖ రాసింది.

లిక్విడేటర్ సమాధానంతో స్పష్టత

ఎన్‌హెచ్ లేఖపై లిక్విడేటర్ పంకజ్ ధనూకా ఈ-మెయిల్ ద్వారా స్పష్టతనిచ్చారు. ఆయన రాసిన లేఖలోని అంశాలను పరిశీలిస్తే.. కొండపల్లి పవర్ ప్రాజెక్టు దివాలా తీసిన నేపథ్యంలో పేజ్-1లో బాగంగా తాము ల్యాంకో ట్రాన్స్‌మిషన్ టవర్ లైన్లను ఆక్షన్ వేశామని, మయన్మార్‌కు చెందిన ఎంసీఎం అనే కంపెనీ మిగతా 6లో..

శ్రీసిద్ధేంద్ర యోగి జయంతి నాట్యోత్సవాలు ప్రారంభం 6లో



20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయం 8లో

గీత కార్మికుల మద్యం దుకాణాల లాటరీ 10న 6లో



మాట్లాడుతున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కిడ్నీ వ్యాధి ప్రభావిత ప్రాంతాల్లో
విస్తృత అవగాహన కార్యక్రమాలు

- నిరాటంకంగా డయాలసిస్, నెఫ్రాలజిస్టు సేవలు
- సీకేడీ నివారణ, నియంత్రణపై సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ

ఎన్టీఆర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఎ.కొండూరు కిడ్నీ వ్యాధి ప్రభావిత ప్రాంతాల్లో వైద్య ఆరోగ్యశాఖ, వివిధ శాఖల సమన్వయంతో జనజాగృతి కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని, కార్యక్రమాల నిర్వహణ, పర్యవేక్షణకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎ.కొండూరు కిడ్నీ వ్యాధి ప్రభావిత ప్రాంతాల్లో వ్యాధి నివారణ, నియంత్రణకు భవిష్యత్ కార్యాచరణపై కలెక్టర్ అధ్యక్షతన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈనెల 18న జీజీహెచ్‌లో క్రానిక్ కిడ్నీ డిసీజ్(సీకేడీ) కేసులపై నిర్వహించిన సమావేశంలో చర్చించిన అంశాలు, వచ్చిన సూచనలపై చర్చించారు.

కాడ్మియం, ఆర్సెనిక్ గుర్తింపునకు పరీక్షలు నిర్వహించాలి

పీల్చే గాలిలో యురేనియం, కాడ్మియం, ఆర్సెనిక్ ఆనవాళ్లు ఉన్నాయా? అనేది నిర్ధారించేందుకు 20 రోజుల్లోగా పరీక్షలు నిర్వహించాలని కాలుష్య నియంత్రణ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నెఫ్రో టాక్సిక్ మెటల్ నిర్ధారణకు మట్టి పరీక్షలు నిర్వహించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఇళ్ల ఆవరణల్లో నీటి వనరుల నమూనాలను పరీక్షించాలని గ్రామీణ నీటి సరఫరా శాఖకు సూచించారు. ఒకవైపు శాస్త్రీయ శోధనలు నిర్వహిస్తూనే 3,600 గృహాలున్న 15 తండాలతో పాటు తండాయేతర ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఇప్పటికే నవోదయం ద్వారా ఎక్సైజ్ శాఖ నిర్వహిస్తున్న కార్యక్రమాలను మరింత విస్తరించాలని సూచించారు. నాటుసారాకు అడ్డుకట్ట వేయడం, విచ్చలవిడిగా పెయిన్ కిల్లర్స్, యాంటీ బయాటిక్స్ వాడకుండా చూడడం కోసం ప్రచార సామగ్రిని, డిజిటల్ కంటెంట్‌ను రూపొందించాలని, కళాజాత ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నెఫ్రాలజిస్టు, డయాలసిస్ సేవలు నిరాటంకంగా షెడ్యూల్ ప్రకారం కొనసాగేలా చూడాలని సూచించారు. డీఎంహెచ్‌వో ఎం.సుహాసిని, డీసీహెచ్ఎస్ డాక్టర్ బీసీకేనాయక్, అసోసియేట్ ప్రొఫెసర్ కె.శ్రీనివాస్, జీజీహెచ్ నెఫ్రాలజీ విభాగాధిపతి సిహెచ్.నాగేశ్వరరావు, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ సమన్వయకర్త డాక్టర్ జె.సుమన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విద్యాసాగర్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పి.శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి పాల్గొన్నారు.

విద్యార్థి బంగారు భవితకు ప్రాథమిక విద్యే పునాది

ఆటోనగర్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యలో 1, 2 తరగతులు చాలా కీలకమైనవని, విద్యార్థి బంగారు భవితకు ప్రాథమిక విద్యే పునాదని, దీన్ని దృష్టిలో ఉంచుకొని ఉపాధ్యాయులు చిన్నారులకు సమగ్ర నైపుణ్యాలను అందించాలని కలెక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. శనివారం మేరీస్ స్టెల్లా కాలేజీలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహించిన లిటరసీ అండ్ న్యూమరసీ మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ముగింపు కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. డీఈవో యూవీ సుబ్బారావు, సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.మహేశ్వరరావు పాల్గొన్నారు.

తిరుపతమ్మ కల్యాణానికి పటిష్ఠ బందోబస్తు

- సీపీ ఎస్వీ రాజశేఖర్‌బాబు

పెనుగంచిప్రోలు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఈనెల 11న జరగనున్న తిరుపతమ్మ అమ్మవారి కల్యాణాన్ని పురస్కరించుకొని 500 మంది పోలీస్ సిబ్బంది, 130 సీసీ కెమెరాలు, 8 డ్రోన్లను వినియోగించి పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామని విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు తెలిపారు. సతీసమేతంగా శనివారం రాత్రి తిరుపతమ్మను ఆయన దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు, అర్చకుల ఆశీర్వచనం అనంతరం సీపీ దంపతులకు డిప్యూటీ కమిషనర్ కిషోర్‌కుమార్ అమ్మ, స్వామివార్ల శేషవస్త్రాలు, ప్రసాదాలు, చిత్రపటాన్ని అందించారు. అనంతరం ఆలయ పరిసరాలను, అమ్మవారి కల్యాణం జరిగే ప్రదేశాన్ని సీపీ పరిశీలించారు. కల్యాణం ఏర్పాట్లను ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎల్.రమ, ఈవో కిషోర్‌కుమార్‌లు సీపీకి వివరించారు. ఏసీపీ తిలక్, సీఐలు పి.వెంకటేశ్వర్లు, వై.వి.వి.ఎల్.నాయుడు, ఎస్సై ఎమ్ఎస్‌కే అర్జున పాల్గొన్నారు.



సీపీ రాజశేఖర్‌బాబు దంపతులకు తిరుపతమ్మ చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయ డిప్యూటీ కమిషనర్ కిషోర్‌కుమార్

దుర్గగుడిలో పంచహారతులకు
పరిమిత టికెట్లు

- 20 మంది సామాన్య భక్తులు, మరో ఐదుగురు వీవీఐపీలు, ప్రముఖులకే అనుమతి
- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని సిబ్బందికి ఈవో రామచంద్రమోహన్ హెచ్చరిక

వన్‌టౌన్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో నిత్యం సాయంత్రం వేళ నిర్వహించే పంచహారతుల కార్యక్రమంలో పాల్గొనే భక్తుల సంఖ్యకు ఈవో కె.రామచంద్రమోహన్ పరిమితి విధించారు. పంచహారతుల్లో పాల్గొనడం కోసం గురు, శుక్ర, ఆది, మంగళవారాలు, ఇతర పర్వదినాల్లో టికెట్లకు భారీగా డిమాండ్ ఉంటోంది. దీనికి తోడు వీవీఐపీలు, వీఐపీల తాకిడి కూడా ఎక్కువగా ఉంటోంది. ఒక్కోసారి వీవీఐపీలు పంచహారతులకు వస్తుండటంతో ఆలయం ఎదుట వారికి తగిన ప్రాధాన్యాన్ని ఇవ్వలేకపోవడం, దీంతో వారంతా ఫిర్యాదులు చేయడం జరుగుతోంది. దేవస్థానం ప్రధాన ఆలయం ఎదుట, లోపల, తగినంత విశాలమైన స్థలం లేకపోవటంతో వచ్చిన భక్తులందరినీ ఆ తక్కువ స్థలంలోనే సర్దుబాటు చేయాల్సి వస్తోంది. పంచహారతుల సమయంలో హారతులను నేరుగా చూడాలన్న ఉద్దేశంతో కొంత మంది పోటీపడుతూ ముందుకు జరగడంతో వెనక కూర్చున్న వీఐపీలు, ఇతర ప్రముఖులు, తమకు ప్రాధాన్యం ఇవ్వటం లేదంటూ, తమను ముందు కూర్చోబెట్టడం లేదంటూ ఫిర్యాదులు చేస్తున్నారు. దీంతో ఈవో కె.రామచంద్ర మోహన్ పంచహారతుల టికెట్లకు పరిమితి విధించారు. ప్రస్తుతం 30 నుంచి 35 టికెట్లను దేవస్థానం విక్రయిస్తోంది. దీనివల్ల రద్దీ బాగా ఉంటోంది. తాజాగా, సామాన్య భక్తులకు 20 టికెట్లను విక్రయించేలా ఈవో నిర్ణయం తీసుకున్నారు. మరో ఐదు టిక్కెట్లను వీవీఐపీలు, ఇతర ప్రముఖులకు కేటాయించేందుకు బ్లాక్ చేసి ఉంచుతారు. సీటింగ్ ముందు వరుసలో టాప్‌మోస్ట్ వీఐపీలు, తర్వాత వరుసలో ప్రొటోకాల్ ప్రజాప్రతినిధులు, ఆ తర్వాత సామాన్య భక్తులకు ప్రాధాన్యం ఇస్తారు. పంచహారతులకు హాజరయ్యే వారిని ఆలయం వెనుక వక్క ఉన్న క్యూ ద్వారా లోపలకు తీసుకొస్తారు. దక్షిణం వైపు ఉన్న ప్రస్తుత ద్వారం నుంచి ఎవరినీ అనుమతించరు. టాప్‌మోస్ట్ ప్రముఖులను దక్షిణ ద్వారం గుండా అనుమతిస్తారు. ఈ నిర్ణయాలను ఆలయ అధికారులకు, సంబంధిత విధులు నిర్వహించేవారికి ఈవో రామచంద్ర మోహన్ తెలియజేశారు. ఎవరైనా ఉల్లంఘించినట్లయితే చర్యలు తీసుకుంటామని కూడా స్పష్టం చేశారు.



పూర్వరంగం అంశంలో కూచిపూడి నాట్య కళామండలి విద్యార్థుల అభినయం

సిద్ధేంద్ర యోగి నాట్యోత్సవాలు ప్రారంభం

కూచిపూడి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత కూచిపూడి నాట్య కళామండలి ఆధ్వర్యంలో సిద్ధేంద్ర యోగి జయంతి నాట్యోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. సిద్ధేంద్ర యోగికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించి స్వామిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. సిద్ధేంద్ర కళా వేదికపై కళాకారులు ప్రదర్శించిన నాట్యాంశాలు ఆహూతులను అలరించాయి. అఖిలభారత కూచిపూడి నాట్య కళామండలి విద్యార్థులుకూచిపూడి నాట్యంలో పూర్వరంగం అంశాన్ని ప్రదర్శించి నాట్యాంశాలకు శ్రీకారం చుట్టారు. విశాఖపట్నానికి చెందిన నాట్య సన్నిధాలయ విద్యార్థులు రాజసాగి నేతృత్వంలో ప్రదర్శించిన అంశాలు రంజింపచేశాయి. నిర్వాహకులు పసుమర్తి మృత్యుంజయ శర్మ, హరనాథ శాస్త్రిలు అతిథులు, కళాకారులను సత్కరించారు. ప్రముఖ నాట్యాచార్యుడు డాక్టర్ వేదాంతం రాధే శ్యామ్, డాక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.



దీక్షితులు, ప్రశాంతినిధుల యుగళ నర్తనం



పెదపారుపూడి మండలం వెంట్రప్రగడ కోళ్లఫారం వద్ద బోల్తా పడిన ఆటో(ఫైల్)



పెదపారుపూడి సమీపంలో పంట బోదెలోకి దూసుకుపోయిన ఆర్టీసీ బస్సు(ఫైల్)

ఎన్నాళ్లీ నరకం

గుంతలమయంగా గుడివాడ-విజయవాడ రహదారి

- వరుస ప్రమాదాలతో బెంబేలెత్తిపోతున్న వాహనదారులు
- ఐదేళ్లలో 50 మంది మృతి.. వందలాది మందికి గాయాలు
- కూటమి ప్రభుత్వం వచ్చాక రోడ్డుకు మరమ్మతులు
- పూర్తిస్థాయిలో రోడ్డును అభివృద్ధి చేయాలని ప్రజల విజ్ఞప్తి

ఆంధ్రజ్యోతి - గుడివాడ:

గుడివాడ-కంకిపాడు రహదారి గోతులతో నిండిపోయింది. వరుస ప్రమాదాలతో వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. గుడివాడ, పామర్రు, గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాలను కలుపుతూ 23 కిలోమీటర్ల మేర ఈ రహదారి విస్తరించి ఉంది. రోడ్డు మరమ్మతులకు వైసీపీ ప్రభుత్వంలో పైసా నిధులు కూడా విడుదల కాకపోవడంతో రహదారి మరింత ఛిద్రమైంది. ఐదేళ్ల వ్యవధిలో ఈ రోడ్డులోని గుంతల వల్ల జరిగిన ప్రమాదాల్లో సుమారు 50 మంది వరకు మృతిచెందారు. వందల మంది కాళ్లు, చేతులు విరగ్గొట్టుకున్నారు. మరి కొందరు తలకు గాయాలు కావడంతో మతిస్థిమితం కోల్పోయిన ఘటనలు కూడా ఉన్నాయి.

మూడు ప్యాకేజీలుగా విభజన

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రధానంగా రహదారుల మరమ్మతులపైన దృష్టి సారించింది. ఈ క్రమంలో 23 కిలోమీటర్ల మేర ఉన్న ఈ రోడ్డు మరమ్మతుల నిమిత్తం ఆర్‌అండ్‌బీ అధికారులు పెదపారుపూడి మండలం భూషణగుళ్ల నుంచి వెంట్రప్రగడ, వెంట్రప్రగడ నుంచి నందమూరు, నందమూరు నుంచి కంకిపాడు వరకు మూడు ప్యాకేజీలుగా విభజించారు. మొదటి ప్యాకేజీలో 5కి.మీ నుంచి 12 కి.మీ (భూషణగుళ్ల - వెంట్రప్రగడ) వరకు మరమ్మతుల నిమిత్తం రూ.5 కోట్లు మంజూరవ్వగా, కాంట్రాక్టర్ రహదారి ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేశారు. రహదారి అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభంకానున్నాయి. రెండో ప్యాకేజీలో 12 కి.మీల నుంచి 15 కి.మీ(వెంట్రప్రగడ- నందమూరు) వరకు రహదారి గుంతలను పూడ్చారు. మూడో ప్యాకేజీలో నందమూరు నుంచి కంకిపాడు వరకు రోడ్డు అభివృద్ధికి రూ.1.70 కోట్లతో టెండరు ప్రక్రియ పూర్తైంది. త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి.

త్వరితగతిన అభివృద్ధి చేయండి

ఆర్‌అండ్‌బీ అధికారులు త్వరితగతిన రహదారి అభివృద్ధి పనులు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు వెంటనే పనులు చేపట్టి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రోడ్డు అభివృద్ధిపై సుప్రీంకోర్టులో పిల్

గుడివాడ-కంకిపాడు రహదారిని అభివృద్ధి చేయాలని భవిష్యత్తు భద్రతా దళం వ్యవస్థాపకుడు వై.వి.మురళీకృష్ణ సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిని వెంటనే విచారణకు చేపట్టాలని కోరుతూ భద్రతా దళం సభ్యులు పోస్టుకార్డు ఉద్యమం ప్రారంభించారు. మొదటి విడతలో మూడు వేల పోస్టు కార్డులను ప్రధాన న్యాయమూర్తికి తపాలాశాఖ ద్వారా పంపించారు. రెండో విడత పోస్టు కార్డు ఉద్యమానికి మళ్లీ శ్రీకారం చుట్టారు. వివిధ ప్రదేశాల్లో శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజల నుంచి సంతకాలను సేకరిస్తున్నారు.



పోస్టుకార్డు ఉద్యమంలో భాగంగా సంతకాలు సేకరిస్తున్న భవిష్యత్ భద్రతా దళం సభ్యులు

కన్నులపండువగా శ్రీకృష్ణ సహిత మహాగణపతి విగ్రహ వాయు ప్రతిష్ఠ

నందిగామ రూరల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): కొణతమాత్మకూరులో వేజెండ్ల కోటయ్య సహిత భక్తాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలోని నూతన ధ్యాన మందిరంలో శ్రీకృష్ణ సహిత మహాగణపతి విగ్రహ వాయు ప్రతిష్ఠా మహోత్సవం శనివారం కన్నుల పండువగా జరిగింది. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అర్చకుడు దాములూరి శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛరణ నడుమ ప్రతిష్ఠ, మూల మంత్రహోమాలు, పూర్ణాహుతి పూజలు, లక్ష్మీనారాయణ శాంతి కల్యాణాన్ని నిర్వహించారు. భారీ అన్నసంతర్పణ నిర్వహించారు.



ప్రతిష్ఠించిన శ్రీకృష్ణ విగ్రహం

హాజరైన ప్రముఖులు

జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ కృష్ణయ్య, తెలంగాణ ప్రభుత్వ సలహాదారుడు శ్రీనివాసరాజు, తెలంగాణ రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ అడిషనల్ ఇన్‌స్పెక్టర్ జనరల్ వెంకటరాజేష్, తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ప్రభుత్వ రిటైర్డ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ తాతినేని యోగానందం, రాష్ట్ర సచివాలయం డిప్యూటీ సెక్రటరీ రామసుబ్బయ్య, రఘురాం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ ఆనందరావు, నందిగామ మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి పాల్గొని పూజలు చేశారు. వీరికి ఉత్సవ కమిటీ సభ్యులు మేడా రాధాకృష్ణ, జవ్వాజి భాస్కరరావు, వేజెండ్ల అర్జునరావు, మన్నేపల్లి వినయ్, ముప్పా రామారావు, సర్పంచ్ మేడా కోటేశ్వరరావులు స్వామి శేషవస్త్రం, ప్రసాదాలు అందించారు. స్పెషల్ గ్రేడ్ రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ వేజెండ్ల రవీంద్రబాబు రామాయణ గ్రంథాలను అందజేశారు.

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

- గన్నవరం అభివృద్ధి పథంలో దూసుకెళ్లాలి
- మహాకుంభమేళాలో గంగమ్మకు ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు పూజలు
- మంత్రి కొల్లు రవీంద్రతో కలిసి పవిత్ర స్నానం

గన్నవరం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, గన్నవరం నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకువెళ్లాలని మహాకుంభమేళాలో గంగమ్మకు పూజలు చేశానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాలో ఆయన మంత్రి కొల్లు రవీంద్ర, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, టీడీపీ సీనియర్ నాయకులు చేరుకూరి వసంత కుమార్, ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త బాలకృష్ణ గురూజీలతో కలిసి పవిత్ర గంగా స్నానం ఆచరించారు. ప్రయాగ్‌రాజ్ విమానాశ్రయంలో త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కొద్దిసేపు ముచ్చటించారు. ఇంద్రసేనారెడ్డిని సన్మానించారు.



పవిత్ర గంగా స్నానం ఆచరిస్తున్న ప్రభుత్వ విప్, యార్లగడ్డ వెంకట్రావు, మంత్రి కొల్లు రవీంద్ర

వీరమ్మకు పసుపుకుంకుమ, సారె సమర్పణ

ఆచారం ప్రకారం తిరునాళ్ల మొదటి రోజున సారె తీసుకెళ్లిన పోలీసులు

ఉయ్యూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): వీరమ్మతల్లికి శనివారం ఉయ్యూరు పట్టణ పోలీసులు పసుపుకుంకుమ, చీర సారె సమర్పించారు. ఏటా తిరునాళ్ల మొదటి రోజున అమ్మవారికి పట్టణ పోలీసులు పసుపుకుంకుమ, సారె సమర్పించడం అనాదిగా వస్తున్న ఆచారం. ఎస్సై విశ్వనాథ్ దంపతులు స్టేషన్ ఆవరణలో పూజలు చేసి మేళతాళాలు, డప్పువాయిద్యాల నడుమ సీఐ రామారావు, సిబ్బందితో కలిసి వేడుకగా వెళ్లి అమ్మవారికి పసుపుకుంకుమ, సారె సమర్పించారు.



వీరమ్మతల్లికి పసుపుకుంకుమ, సారె సమర్పించేందుకు వెళుతున్న పట్టణ ఎస్సై విశ్వనాథ్ దంపతులు, సీఐ రామారావు

హిట్లర్!

(5వ పేజీ తరువాయి)

చెప్పినట్లుగానే చేయాలని అధికారులను కించపరిచే విధంగా మాట్లాడుతుండటంతో ఎవరికి వారు మిన్నకుండిపోతున్నామని అధికారులు అంటున్నారు.

పెండింగ్‌లోనే రిటైర్డ్ ఉద్యోగుల ఫైళ్లు

జిల్లా పరిషత్ యాజమాన్యంలో పనిచేస్తూ పదవీ విరమణ పొందిన ఉద్యోగుల ఫైళ్లు నెలల తరబడి పెండింగ్‌లోనే ఉండిపోతున్నాయి. సదరు ఉద్యోగులు తమకు పింఛన్, ఇతరత్రా సౌకర్యాలు అందడంలో జాప్యం జరుగుతోందని, తమ ఫైళ్లపై త్వరితగతిన సంతకాలు చేయాలని జిల్లా పరిషత్‌లోని కీలక అధికారి చుట్టూ తిరుగుతున్నారు. అయినా వారి వినతులను సదరు అధికారి పట్టించుకోవడంలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో పలువురు ఉద్యోగులు తమ సమస్యలను జెడ్పీ చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్తున్నారు. ఆమె వెంటనే స్పందించి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని చెబితే, ఆమె ఎదుట సదరు కీలక అధికారి చేస్తానని చెబుతున్నాడని, ఆ తర్వాత ఉద్యోగులు ఈ అధికారి వద్దకు వెళితే జెడ్పీ చైర్‌పర్సన్ మాటకూడా వినేది లేదని తనదైన శైలిలో తెగేసి చెబుతుండటం గమనార్హం. ఇటీవల జరిగిన జిల్లా పరిషత్ బడ్జెట్ సమావేశంలో పలువురు జెడ్పీటీసీ సభ్యులు తమ ప్రాంతంలో నెలకొన్న సమస్యలను ఏకరువు పెట్టారు. కొందరు సభ్యులు పలువురు అధికారుల నిర్లక్ష్య వైఖరిపైనా విమర్శలు చేశారు. దీంతో సదరు కీలక అధికారి జెడ్పీటీసీ సభ్యులను సైతం నొప్పించే విధంగా మాట్లాడారు. మా మండలాల్లో నెలకొన్న సమస్యలు,సక్రమంగా పనిచేయని అధికారుల తీరును వివరిస్తుంటే, తమను ఎందుకు అడ్డుకుంటున్నారంటూ సభ్యులంతా ఒక్కసారిగా ఈ అధికారిపై ధ్వజమెత్తిన విషయం తెలిసిందే.

ఎన్‌హెచ్‌కు షాక్!

(5వ పేజీ తరువాయి)

కొనుగోలు చేసిందన్నారు. ఆ కంపెనీ పూర్తి డబ్బులు చెల్లించలేదని, తమ మధ్య నెలకొన్న వివాదం కూడా ఎన్‌సీఎల్‌టీలో నడుస్తోందన్నారు. ఎంసీఎం కంపెనీకి, రాధా సంస్థకు సంబంధం లేదని స్పష్టతనిచ్చారు. దీంతో పాటు తాము ఎక్కడా కూడా ల్యాంకో ట్రాన్స్‌మిషన్ టవర్ల లైన్ షిఫ్టింగ్‌కు అనుమతి ఇవ్వలేదని, వారికి డబ్బులు చెల్లిస్తే తమకు బాధ్యత లేదన్నారు. తమ అనుమతితో లేకుండా జరిగిన చర్యలకు చట్టపరమైన చిక్కులను కూడా చవిచూడాల్సి ఉంటుందని హెచ్చరించారు.

రోబో దివ్యాన్ష్ హల్‌చల్

- ఏఐ హ్యాకథాన్-2025లో అడిగిన ప్రశ్నలన్నింటికీ సమాధానం..విశాఖ 'అవంతి' విద్యార్థుల ప్రతిభ

పెనమలూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఏఐ హ్యాకథాన్-2025 శుక్రవారం ముగిసింది. కార్యక్రమంలో దివ్యాన్ష్ అనే రోబో హల్‌చల్ చేసింది. విశాఖ అవంతి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు గణేష్, సురేష్ నెల రోజులు కష్టపడి దీనిని తయారు చేశారు. ఎవరు ఏ ప్రశ్న అడిగినా తొట్రుపడకుండా సమాధానాలిచ్చింది.



ప్రశ్నలకు సమాధానాలు చెబుతున్న రోబో దివ్యాన్ష్

ఎన్టీఆర్, కలాం దిగివచ్చిన వేళ..

ఏఐ హ్యాకథాన్-2025లో భాగంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో దివంగత ఎన్టీఆర్, డాక్టర్ అబ్దుల్ కలాంలను కృత్రిమ మేధ భూమిమీద సాక్షాత్కరింపజేసింది. వీఆర్ సిద్ధార్థ కళాశాలలో ఇంజనీరింగ్ విద్యార్థులనుద్దేశించి వారిద్దరూ మాట్లాడారు. సీఎస్ఈ నాలుగో ఏడాది చదువుతున్న వివేక్, శ్రీహర్ష, అనిరుధ్, చాణక్య ఇండియన్ సర్వర్స్ సంస్థ నెల రోజులు కష్టపడి తయారు చేశారు. ఈ ఆర్టికల్ అందరినీ ఆకర్షించింది. ఎన్టీఆర్, అబ్దుల్ కలాంల వందలాది చిత్రాలను విద్యార్థులు సేకరించి ఏఐ మోడల్‌లో తయారు చేశారు. మాటలను మిమిక్రీ చేసి ఆగ్మెంటెడ్ రియాలిటీ, ఏఐ సాయంతో ఎన్టీఆర్, అబ్దుల్ కలాంలు మాట్లాడినట్లుగా సృష్టించారు.



ఏఐ మేధస్సుతో సృష్టించిన దివంగత ఎన్టీఆర్, అబ్దుల్ కలాం

వైసీపీ.. ఓ 420 పార్టీ

- జగన్ డిస్ట్రక్టర్.. చంద్రబాబు కనస్ట్రక్టర్: ఉండవల్లి శ్రీదేవి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ..ఓ 420 పార్టీ అని ఆ పార్టీ అధినేత మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి డిస్ట్రక్టర్ అని సీఎం చంద్రబాబు కనస్ట్రక్టర్ అని మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల అబ్జర్వర్, మాజీ ఎమ్మెల్యే, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్(రాజా) గెలుపును కాంక్షిస్తూ కొండపల్లి మున్సిపల్ టీడీపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు.



మాట్లాడుతున్న మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి

అమరావతి రోడ్లపై కంకర కొట్టేసిన పార్టీ

అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజా వేదిక కూల్చి ఆరు నెలల్లో మూడు రాజధానుల ఆట మొదలు పెట్టిన జగన్ వల్ల ఎమ్మెల్యేగా బయటకు రాలేకపోయానని శ్రీదేవి తెలిపారు. రోడ్లపై పోసిన కంకర కూడా కొట్టేసిన పార్టీ వైసీపీ అని దుయ్యబట్టారు. నందిగం సురేష్ అనే 420ని పెంచిపోషించి ప్రజా రాజధాని అమరావతిలో ఒక్క సీసీ రోడ్డు వేయకుండా లైటు వేయకుండా అనేక ఇబ్బందులకు జగన్ గురి చేశాడన్నారు. దళిత నేతగా విపత్కర పరిస్థితులను ఎదుర్కొన్నానన్నారు. కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి రాజాకు తొలి ప్రాధాన్య ఓటు వేసి, అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు. దారునాయక్, చెన్నుబోయిన చిట్టిబాబు, చుట్టుకుదురు శ్రీనివాసరావు, చనమోలు నారాయణ, చుట్టుకుదురు వాసు, షైలా సైదులు, అప్సర్ పాల్గొన్నారు.



వధూవరులకు శుభాకాంక్షలు చెబుతున్న పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

కాంగ్రెస్ నేత మొవ్వ మోహనరావు
కుమారుడి వివాహానికి షర్మిల

ఉయ్యూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఆకునూరు సమీపాన అక్కినేని కన్వెన్షన్‌లో శనివారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మొవ్వ మోహనరావు కుమారుడు వివాహానికి పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల హాజరై వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. ధనేకుల మురళీమోహన్‌రావు, నరసింహారావు స్వాగతం పలికారు.

10న మద్యం దుకాణాల లాటరీ

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లాలో గీత కులాల వారికి కేటాయించిన 12 మద్యం దుకాణాలను ఈనెల 10వ తేదీన ఉదయం 9 గంటలకు కలెక్టరేట్ సమావేశపు హాలులో లాటరీ తీయనున్నట్లు ఎక్సైజ్ అధికారి భార్గవ్ పేర్కొన్నారు. గౌడ్స్ కులానికి 3, గౌడ కులానికి 8, శెట్టిబలిజ కులానికి 1 షాపు కేటాయించామన్నారు. దరఖాస్తులను లాటరీ తీసి షాపులు కేటాయిస్తామన్నారు. వివరాలకు 99636 04239కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110,119, 130
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 475

ఏసీ, సోలార్ టెక్నీషియన్, ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో శిక్షణ

ఉంగుటూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆత్కూరు స్వర్ణభారత్‌ట్రస్ట్‌లోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ నైపుణ్య శిక్షణా కేంద్రంలో, నిరుద్యోగ యువకులకు స్వయం ఉపాధి కల్పించే పలు వృత్తి నైపుణ్య కోర్సుల్లో ఈ నెల 12నుంచి ఉచిత శిక్షణా తరగతులు ప్రారంభిస్తున్నట్లు స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఏసీ టెక్నీషియన్, సోలార్ టెక్నీషియన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ పొందేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవచ్చుని, 18నుంచి 35సంవత్సరాల లోపు వయసు కలిగి, పది/ఇంటర్/ఐటీఐ/డిప్లొమా చదివిన వారు ఆయా కోర్సుల్లో శిక్షణ పొందేందుకు అర్హులని తెలిపారు. వివరాలకు 9666422627(ఎలక్ట్రీషియన్), 9492787399(ఏసీ టెక్నీషియన్), 8309031720(సోలార్ టెక్నీషియన్), నెంబర్లలో సంప్రదించాలని దీపా వెంకట్ పేర్కొన్నారు.

సోమేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు ప్రారంభం

ఉయ్యూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు సోమేశ్వరస్వామి వార్షిక కళ్యాణ మహోత్సవాలు శనివారం నేత్రపర్వంగా ప్రారంభమ య్యాయి. ఈ నెల 13వరకు జరిగే ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజున అఖండస్థాపన, త్రిశూల మండపారాధన, వాస్తుపూజ, అంకురారోహణ, అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో మద్దూరు వీఆర్వోకి తీవ్రగాయాలు

కంకిపాడు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : గూడూరు మండలం రామరాజుపాలెం అడ్డరోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మద్దూరు వీఆర్వోకు తీవ్ర గాయాలయ్యాయి. సేకరించిన సమాచారం మేరకు.. కంకిపాడు మండలం మద్దూరు గ్రామ వీఆర్వో జి. సుబ్బారావు శుక్రవారం రాత్రి బైక్‌పై కంకిపాడు నుంచి మచిలీపట్నం వెళ్తుండగా రామరాజుపాలెం వద్ద వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సుబ్బారావు ఆయన కుమార్తెకు తీవ్ర గాయాలయ్యాయి.

నేడు టీడీపీలో చేరనున్న కంకిపాడు సర్పంచ్, ఉపసర్పంచ్

కంకిపాడు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ, ఎమ్మెల్యే బోడె ప్రసాద్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై తెలుగుదేశం పార్టీలో చేరుతున్నామని కంకిపాడు ఉప సర్పంచ్ రాచూరి చిరంజీవి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ, ఆదివారం సాయంత్రం సర్పంచ్ బాకీ రమణతో పాటు ఐదుగురు వార్డు సభ్యులు, పలువురు వైసీపీ నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో వైసీపీ పని అయిపోయిందని, కంకిపాడు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు పెద్ద సంఖ్యలో టీడీపీలో చేరనున్నట్లు తెలిపారు.

ఘనంగా గ్రీన్ డే

వణుకూరు (కంకిపాడు), ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : పెనమలూరు మండలంలోని వణుకూరు, గోసాల గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రా ల్లో గ్రీన్ డే నిర్వహించారు. చిన్నారులు గ్రీన్ దుస్తులు ధరించి, గ్రీన్ బెలూన్స్, గ్రీన్ రంగులోని ఆట బొమ్మలను ప్రదర్శిస్తూ ఆడుకున్నారు. గ్రీన్ రంగు కూరగాయలు, పండ్లు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఇమ్మానుయేలు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నేత అనుమోలు ప్రభాకర్

విద్యావేత్త వేశపోగు ఇమ్మానుయేలుకు ఘననివాళి

గంగూరు (కంకిపాడు) 8 (ఆంధ్రజ్యోతి) : గంగూరు నోబుల్ ఇంగ్లీషు మీడియం స్కూల్ ఫౌండర్, కరెస్పాండెంట్ అండ్ డైరెక్టర్ వేశపోగు ఇమ్మానుయేలు మృతి బాధాకరమని తాడిగడప మున్సిపాలిటి టీడీపీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకర్ అన్నారు. శనివారం మృతి చెందిన వేశపోగు ఇమ్మానుయేలు పార్థీవదేహాన్ని ఆయన సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అనుమోలు ప్రభాకర్ మాట్లాడుతూ పాఠశాలను స్థాపించి ఎంతో మంది పేదలకు ఉచిత విద్యనందించారని కొనియాడారు. ఇమ్మానుయేలు కుటుంబ సభ్యులను ఆయన సంతాపం వ్యక్తం చేశారు.

వ్యాపార ప్రకటనల కోసం

ప్రధాన రహదారికి గుంతలు!

- లక్షల రూపాయలతో ఇటీవల వేసిన రోడ్డు ధ్వంసం చేస్తున్నా పట్టించుకోని ఆర్ అండ్ బీ, నగర పంచాయతీ అధికారులు
- చోటామోటా నాయకుల అండతో ఆర్చీలు ఏర్పాటు చేసి లక్షలాది రూపాయలకు అద్దెకిస్తున్న వ్యాపారులు

(ఉయ్యూరు - ఆంధ్రజ్యోతి)

ఉయ్యూరు ప్రధాన రహదారుల్లో యథేచ్ఛగా గుంతలు తవ్వి రహదారులు ధ్వసం చేస్తూ స్వప్రయోజనాలకు ప్రభుత్వ ఆస్తులకు నష్టం వాటిల్ల చేస్తున్నారు కొంతమంది వ్యాపారులు. స్థానికంగా ఉన్న కొంత మంది చోటామోటా నాయకుల అండతో ఆర్ అండ్ బీ శాఖకు చెందిన ప్రధాన రహదారిని తాండవలక్ష్మి థియేటర్, రింగ్ సర్కిల్, పలుచోట్ల ఇరువైపులా ఎక్కడపడితే అక్కడ తవ్వి



తాండవలక్ష్మి థియేటర్ సమీపాన ప్రధాన రహదారిని తవ్విగుంతలు చేస్తున్న కూలీలు

గుంతలు చేసి బాదులు పాతి ఆర్చీ వలే కట్టి వ్యాపార ప్రకటనలకు లక్షల రూపాయలకు అద్దెకిస్తూ లబ్ధి పొందుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో రహదారులను పట్టించుకోపోవడంతో అడుగడుగునా గుంతలు పడి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇటీవల లక్షల రూపాయలతో పట్టణంలో ప్రధాన రహదారులకు మరమ్మతులు చేశారు. ఈ పరిస్థితుల్లో వీరమ్మ తిరునాళ్ల రావడంతో భక్తులకు స్వాగతం పలుకుతున్నట్లు వ్యాపార సంస్థలు, పేర్లతో పెద్ద బ్యానర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ పరిస్థితి వైసీపీ హయాంలో విచ్చలవిడిగా సాగగా కూటమి ప్రభుత్వంలో కూడా కొందరు దీన్ని కొనసాగించడంపై స్థానికులు మండిపడుతున్నారు. అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



ఆర్చీ ఏర్పాటుకు పాతిన బాదులు

భవ్యరామాలయ నిర్మాణానికి రూ.12 లక్షలు

పెనమలూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : పోరంకిలో నిర్మించి, త్వరలో ప్రారంభించనున్న భవ్యరామాలయానికి శనివారం ఒక్క రోజే దాతలు, భక్తులు పన్నెండు లక్షల విరాళాలను అందజేశారు. నేటి నుంచి 13వ తేదీ వరకు జరగనున్న విగ్రహప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ, అన్న సమారాధన కార్యక్రమాలకు విరివిగా భక్తులు విరాళాలు అందిస్తున్నారు. శనివారం కర్లపూడి సుధాకర్ జ్ఞాపకార్థం కర్లపూడి రంగారావు, లలితమ్మ దంపతులు ఐదు లక్షలు, రామినేని సుబ్బారావు, భార్య నాగశిరోమణిల జ్ఞాపకార్థం తోటకూర సరోజిని ఐదులక్షలు, ఏ రామకృష్ణ, పద్మకుమారి దంపతులు లక్ష రూపాయలు, దొండపాటి రాంబాబు, శ్రీదేవి దంపతులు లక్షను కమిటీ సభ్యులకు అందజేశారు. గ్రామంలో నిర్మించిన భవ్య రామాలయ కార్యక్రమాలకు ఇంతటి ప్రతిస్పందన ఊహించలేదని కమిటీ సభ్యులు వ్యాఖ్యానించారు.



కమిటీ సభ్యులకు విరాళాలు అందజేస్తున్న దాతలు



భూమిపూజ చేస్తున్న పుణ్యదంపతులు

లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ

గన్నవరం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేసరపల్లిలో నూతనంగా నిర్మించనున్న లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవాలయం భూమిపూజ కార్య క్రమాన్ని శనివారం 11 మంది పుణ్యదంపతులు వైభవంగా నిర్వహించారు. పండితులు నాగ మణికంఠ శివాచారి బృందంచే గణపతిపూజ, పుణ్యాహవచనం, పంచగవ్యం, వాస్తుపూజలు చేశారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ పొట్లూరి బసవరావు, మరీదు రాంబాబు, రాజులపాటి శ్రీనివాసరావు(ఆర్ఎస్), హనుమంతురావుతో పాటు మరో ఏడుగురు దంపతులు పీటల మీద కూర్చుని శాస్త్రోక్తంగా వాస్తు హోమం, మూలమంత్రం, మహాసుదర్శన, నరసింహ, శ్రీనివాస హోమాలను నిర్వహిం చారు. అనంతరం మహాపూర్ణాహుతిని సమర్పించారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, పొట్లూరి బసవరావుల సహకారంతో పనులు ప్రారంభించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీమౌనిక, ఎంపీటీసీ సభ్యుడు శాంతి కిషోర్, యర్రగాని రత్తయ్య, చలపాటి దిలీప్, రాజులపాటి పాల్గొన్నారు.



మద్దూరు ఎన్టీఆర్ ఘాట్‌లో భారీ రావి చెట్టు మొదలు నాటించిన ఎమ్మెల్యే బోడె ప్రసాద్, మాజీ జెడ్పీటీసీ గొంది శివరామకృష్ణ

వృక్ష ప్రేమికుడు ఎమ్మెల్యే బోడె ప్రసాద్

మద్దూరు ఎన్టీఆర్ ఘాట్‌లో భారీ రావి చెట్టుకు ప్రాణప్రతిష్ఠ

కంకిపాడు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : వృక్ష ప్రేమికుడు బోడె ప్రసాద్ అని మరో మారు నిరుపించుకున్నారు. తాడిగడపలో వంతెన నిర్మాణానికి అడ్డుగా ఉన్న ఓ భారీ రావి చెట్టును సంబంధిత అధికారులు తొలగించేందుకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆ చెట్టును 12 అడుగుల మేరకు కాండాన్ని ఉంచి ఏరులతో సహ తీయించారు. భారీ క్రేన్ సాయంతో ట్రాలీ మీద ఆ కాండాన్ని మద్దూరు ఎన్టీఆర్ ఘాట్‌లో నాటించి ప్రాణప్రతిష్ఠ చేశారు. దీంతో స్థానికులు బోడె ప్రసాద్ తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తున్నారు.

సాయిబాబా మందిరంలో

ఘనంగా వార్షికోత్సవ పూజలు

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఐటీఐ రోడ్డులోని షిరిడీ సాయిబాబా మందిరంలో శనివారం బాబాకు ప్రత్యేక అభిషేకాలు వేదు కగా నిర్వహించారు. మందిరం 18వ వార్షికోత్సవం పురస్కరించుకుని బాబాకు అర్చనలు, పూజలు, అభిషేకాలు జరిపారు. భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం బాబాకు గ్రామంలో పల్లకీసేవ నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తుల సహకారంతో వెయ్యి మందికి అన్నసంతర్పణ చేశారు. మందిరం అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కొల్లి వెంకట్రావు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

భీష్మ ఏకాదశి సందడి

స్థానిక నూజివీడు రోడ్డులోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం భీష్మ ఏకాదశి పర్వదినం భక్తుల సందడి కనిపించింది. ఆలయ అర్చకులు చక్రవాదుల సీతారామాచార్యులు ఆధ్వర్యంలో గోదాదేవి, రంగనాథుల దేవతామూర్తులకు అభిషేకాలు నిర్వహించి భక్తులు అందించిన పూలతో అలంకరించారు. మహిళలు స్వామి వారిని దర్శించుకున్నారు.

ఆలపాటి రాజా విజయానికి కృషి చేయాలి

టీడీపీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు

పెనమలూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి పార్టీలు టీడీపీ, జనసేన, బీజేపీలు బలపరుస్తున్న అభ్యర్థి ఆలపాటి రాజా గెలుపు ఖాయమని టీడీపీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు వ్యాఖ్యానించారు. శనివారం కానూరులోని తన కార్యాలయంలో స్థానిక టీడీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం, గెలుపు సాధ్యాసాధ్యాలు తదితర అంశాలపై చర్చించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటి రాజా గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రతి ఒక్కరూ శాయశక్తులా కృషి చేయాలని కోరారు. ప్రతి పట్టభద్రుని ఇంటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థిస్తూ టీడీపీ కూటమి హయాంలో జరిగిన అభివృద్ధిని వివరించాలని సూచించారు. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ గెలుపుకోసం ఏవిధంగా పనిచేశామో..అంతకన్నా రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలని కోరారు. ఆలపాటి రాజా గతంలో ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేసినప్పుడు నీతి నిజాయితీలతో పని చేసిన విషయాన్ని ఓటర్లకు వివరించాలని కోరారు. ప్రాంతాల వారీగా ఓటర్ల జాబితాలు తయారయ్యాయని, ఒక్కొక్కరు కనీసం వంద మంది ఓటర్లను కలిసి వారి ఓట్లను అభ్యర్థించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు జువ్వా రాంబాబు, టీడీపీ కృష్ణాజిల్లా మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ బుజ్జి, దోనేపూడి రవికిరణ్, ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ నేతల సమావేశంలో మాట్లాడుతున్న వెలగపూడి శంకరబాబు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో లక్ష్మణరావుకు విజయం చేకూర్చాలి

ఉయ్యూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 7 నెలలు కావస్తున్నా డీఎస్సీ నిర్వహించి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయకుండా తాత్సార్యం చేస్తుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వై నరసింహారావు అన్నారు. కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు విజయం కాంక్షిస్తూ స్థానిక నాగళ్ల రాజేశ్వరమ్మ జానకీరామయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం ఉద్యోగ, అధ్యాపక, ఉపాధ్యాయ, పెన్షనర్ల, అవుట్ సోర్సింగ్, ప్రైవేటు ఉద్యోగులు, ప్రజాసంఘాల ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అన్ని వర్గాల సమస్యల పరిష్కారం కోసం పోరాడే లక్ష్మణరావును ఎమ్మెల్సీగా గెలిపించాలన్నారు. ఎమ్మెల్సీగా తాను సాధించిన ప్రజాప్రయోజనాలను లక్ష్మణరావు గుర్తు చేసి రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం చేకూర్చాలన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షౌకత్ హుస్సేన్, కనకారావు, వరప్రసాద్, శివనాగేంద్రం, పీవీ రమణ, గోపాల్ పాల్గొని లక్ష్మణరావుకు విజయం చేకూర్చాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీడీఎఫ్ అభ్యర్థి కె.ఎస్. లక్ష్మణరావు

రైతులు విశిష్ట సంఖ్య తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలి

ఉయ్యూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ రంగం ఆధునీకరణలో భాగంగా కేంద్రప్రభుత్వం రైతులకు 14 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య (యునిక్ ఐడి) ఆధార్ కార్డ్ తరహాలో రైతులకు అందించనున్న నేపథ్యంలో సొంతభూమి ఉన్న ప్రతి రైతు విశిష్ట సంఖ్య తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని గన్నవరం ఏడీఏ ఎం సునీల్ అన్నారు. గండిగుంట రైతు సేవా కేంద్రం - 2లో శనివారం రైతు విశిష్ట సంఖ్య నమోదు కార్యక్రమాన్ని పర్య వేక్షించారు. ఏవో నిస్సీగ్రేస్, వీపీఏలు పాల్గొన్నారు.



గండిగుంట ఆర్ఎస్‌కేలో రైతు విశిష్ట సంఖ్య నమోదు పరిశీలిస్తున్న గన్నవరం ఏడీఏ సునీల్

ఉంగుటూరు : సొంత వ్యవసాయ భూమి కలిగిన ప్రతిరైతు రైతుసేవాకేంద్రంలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకునేలా ప్రోత్సహించాలని ఏవో బీవీఎస్ఆర్ఎస్ హరీష్‌కుమార్ వీపీఏలకు సూచించారు. స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఫార్మర్ యూనిక్ నెంబర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ- విధి విధానాలపై వీపీఏలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో బి.దుర్గా నాగేశ్వరరావు, వీపీఏలు పాల్గొన్నారు.



ఉంగుటూరులో..



నేటి నుంచి గుణదల మేరీమాత తిరునాళ్ల

నిష్కళంకమాతకు వందనం



దక్షిణ భారతదేశంలోనే రెండో అతిపెద్ద క్రైస్తవ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న గుణదల మేరీమాత తిరునాళ్లు అంగరంగ వైభవంగా ప్రారంభం కాబోతున్నాయి. దేశంలోనే వేళంగిణిమాత ప్రార్థనా మందిరం తర్వాత గుణదల మరియ మాత ప్రార్థనా మందిరం రెండోదిగా కీర్తి పొందుతోంది. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే క్రైస్తవులు గుణదల మేరీమాతను దర్శించుకుంటారు. ఆదివారం నుంచి గుణదల మేరీమాత తిరునాళ్ల వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో గురువులు సమష్టి దివ్యబలిపూజ, భక్తుల ప్రార్థనలు, మొక్కుబడుల స్తుతి, ధూపం వంటివి జరుగుతుంటాయి. - ఆంధ్రజ్యోతి, గుణదల

- దక్షిణ భారతదేశంలోనే రెండో అతి పెద్ద క్రైస్తవ పుణ్యక్షేత్రం
- 1924లో స్వయం సిద్ధంగా వెలిసిన మరియ మాత
- 3 రోజుల పాటు ఘనంగా ఉత్సవాలు

క్రైస్తవ ఆధ్యాత్మిక శిఖరం గుణదల పుణ్యక్షేత్రం మేరీమాత శతాబ్ది మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభం కానున్నాయి. గుణదల కొండ మధ్యలోని గుహలో మరియ మాత 1924లో స్వయం సిద్ధంగా వెలిసింది. ప్రకృతి సౌందర్యంతో శోభాయమానంగా విలసిల్లుతుంది. కొండమధ్యలో మరియమాత, శిఖరాగ్రాన పరిశుద్ధ శిలువను ప్రతిష్ఠించినప్పటి నుంచి ఈ కొండ మత పరంగా ప్రాధాన్యతను సంతరించుకుంది. పరిశుద్ధ శిలువ భగవంతుడి పరిపూర్ణతను జ్ఞప్తికి తేగా మార్గమధ్యలో ఉన్న మరియమాత గుహ మరియ ద్వారా యేసుని చేరగలమను సత్యమును ప్రస్ఫుటంగా ప్రకటిస్తోంది. కొండ చుట్టూ కతోలిక గ్రామాలైన లూర్దునగర్, బెత్లహామ్‌నగర్, క్రీస్తురాజపురం, అరుణ్‌నగర్ అభివృద్ధి చెందుతున్నాయి. రాత్రి సమయంలో గుహ వద్ద ఒక దీపం దివ్యంగా కాంతులీనుతోంది. కొండ శిఖరాగ్రాన నిలిచిన శిలువ సుదూర ప్రాంతాల వరకు కన్పిస్తూ క్రైస్తవ విశ్వాస శిఖరాగ్రము అధిరోహించాలని అందరినీ ఆహ్వానిస్తున్నట్టు ఉంటుంది. ప్రస్తుతం కొండపైన శిలువ విజయవాడ పట్టణానికి కేంద్రస్థానమని చెప్పాలి. 1933లో రెవరెండ్ ఫాదర్ పి.అర్లాటి స్వాముల వారు కొండ శిఖరాగ్రాన ఒక శిలువను ప్రతిష్ఠించారు. 1925వ సెయింట్ జూసఫ్ ఇనిస్టిట్యూట్ రెక్టర్ అయిన అర్లాటి స్వాములవారు గుణదల కొండపై ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన గుహలో మరియమాత స్వరూపాన్ని స్థాపించారు. కొండ కింద అనాథ గృహంలోని బాలురు, స్థానిక కతోలికులు ఫిబ్రవరి 11న మరియమాత ఉత్సవం జరుపుకోవడం ప్రారంభించారు. కొండ మధ్యలోని గుహ వద్ద ప్రదేశాన్ని విశాలవంతంగా తీర్చిదిద్ది దివ్యబలి పీఠాన్ని నిర్మించారు. దేవమాత ఉత్సవంలో తెలుగు కతోలికులు ఎక్కువగా పాల్గొనే సౌలభ్యం కలిగించేందుకు 1947 నుంచి ఈ ఉత్సవాన్ని ఫిబ్రవరి 11న జరపాలని నిశ్చయించారు. కొండ దిగువభాగం నుంచి గుహ వరకు అలాగే కొండ శిఖరాగ్రాన ఉన్న శిలువ వరకు కొండపైకి వెళ్లే మార్గం వెంబడి జపమాల దేవ రహస్యాలను వర్ణించు చిత్రాలను ఏర్పాటు చేశారు. వీటిని బిషప్ ఆఫ్రిజియా నగరం వారు బహుకరించారు. 1951లో గుహపై రమణీయమైన ఆర్చ్ నిర్మించి మరియమాత సుందర విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. యేసు క్రీస్తు అనుభవించిన శిక్షను గుర్తు చేసుకుంటూ 14 స్థలాలు ఏర్పాటు చేశారు. ప్రతి ఏడాది ఈ ఉత్సవాలకు సుమారు 15లక్ష లక్షల మంది భక్తులు వస్తున్నారు. ప్రతి ఆదివారం 25వేల మంది భక్తులు పుణ్యక్షేత్రాన్ని సందర్శిస్తున్నారు.



మేరీమాతను దర్శించుకుంటున్న భక్తులు

ట్రాఫిక్ మళ్లింపు..

మేరీమాత ఉత్సవాల సందర్భంగా నగర ప్రజలకు విజయవాడ మీదుగా ప్రయాణాలు చేసేవారికి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ మళ్లిస్తున్నట్టు నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు తెలిపారు. ఈనెల 9 నుంచి 12 వరకు ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు. పండిట్ నెహ్రూ బస్టాండ్ నుంచి గన్నవరం, ఆటోనగర్ వైపునకు ఏలూరు రోడ్డు మీదుగా వెళ్లే ఆర్టీసీ సిటీ బస్సుల రాకపోకలు మళ్లించడం జరుగుతుందన్నారు. అలాగే గన్నవరం నుంచి ఏలూరు రోడ్డు మీదుగా బస్టాండ్ వైపు వెళ్లే వాహనాలను కూడా దారి మళ్లించి వేరే మార్గాల గుండా పంపిచనున్నట్టు తెలిపారు.

ఆర్టీసీ స్పెషల్స్..

బీఆర్‌టీసీ రోడ్డు మాచవరం డౌన్‌వైపు నుంచి రామవరప్పాడు రింగ్ వైపునకు వాహనాలను మళ్లించనున్నట్టు తెలిపారు. పడవల రేవు జంక్షన్ నుంచి గుణదల ఈఎస్ఐ జంక్షన్ వరకు వాహనాలకు అనుమతించేది లేదన్నారు. గంగిరెద్దుల దిబ్బ వైపు నుంచి బెత్లహామ్ నగర్ రోడ్డు మీదుగా పడవలరేవు వైపునకు ఇరువైపులా వాహనాలకు అనుమతి లేదన్నారు. ఏలూరు రోడ్డులో ఆటో రిక్షాలను మాచవరం డౌన్ వరకు మాత్రమే అనుమతించడం జరుగుందన్నారు. రామవరప్పాడు రింగ్ నుంచి వచ్చే ఆటో రిక్షాలను ఏలూరు రోడ్డు ఈఎస్ఐ బస్టాప్ వరకు మాత్రమే అనుమతించనున్నట్లు చెప్పారు.

పార్కింగ్ ప్రదేశాలు..

- పడవలరేవు వద్ద మధురానగర్ వంతెన వద్ద బీఆర్‌టీఎస్ రోడ్డు మధ్యలో వాహనాలు పార్కింగ్ చేసుకోవాలి.
- డ్యూటీలో ఉన్న అధికారులు వారి వాహనాలను సెంట్‌జోసఫ్ హైస్కూల్ ఆవరణలో పార్క్ చేసుకోవాలి
- జియోన్ బైబిల్ కాలేజి ఎదురుగా ఉన్న ప్రైవేటు ఖాళీ స్థలంలో ద్విచక్రవాహనాలు పార్కింగ్ చేయాలి.

లోకమాతకు నీరాజనాలు.. మోన్సిగ్నోర్ మువ్వల ప్రసాద్

- ఘనంగా ముగిసిన నవదిన ప్రార్థనలు



మానవాళికి మరియతల్లి దేవుని తల్లియేగాక మనందరి తల్లిగా ప్రపంచ వ్యాప్తంగా కోట్లాదిమంది భక్తులచేత కీర్తించబడుతుందని విజయవాడ కతోలిక పీఠం మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్ తెలిపారు. 9 రోజులుగా జరుగుతున్న నవదిన ప్రార్థనలు శనివారం రాత్రితో ఘనంగా ముగిశాయి. చివరిరోజు ప్రార్థనలకు మోన్సిగ్నోర్ మువ్వల ప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన భక్తులకు సందేశమిస్తూ కరుణామయుడైన క్రీస్తు ప్రేమ, దయ, జాలి ఆయన తల్లి మరియమాతలో స్పష్టంగా చూడగలుగుతామన్నారు. పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు మాట్లాడుతూ ఆదివారం ఉదయం 6.30 గంటలకు విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు గుణదల లూర్దుమాత 101వ మహోత్సవాలను లాంఛనంగా ప్రారంభిస్తారన్నారు. తొలుత గురువులు ద్విసత్ప్రసాదంతో కొండపైకి చేరుకున్నారు. అనంతరం మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్ తదితర గురువులు సమష్టి దివ్యపూజాబలి సమర్పించారు.

రామవరప్పాడు స్టేషన్‌లో రైళ్ల నిలుపుదల

రైల్వే స్టేషన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మేరీమాత ఉత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం రామవరప్పాడు రైల్వే స్టేషన్‌లో పలు రైళ్లను నిమిషం పాటు నిలుపుదల (హాల్ట్) చేస్తున్నట్టు విజయవాడ రైల్వే డివిజన్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే పలు రైళ్లకు అనుమతిచ్చింది. ఈనెల 9 నుంచి 11 అమలు చేస్తారు. 17479 పూరీ - తిరుపతి ఈనెల 9, 10తేదీల్లో మధ్యాహ్నం 1.15కు వచ్చి 1.16 గంటలకు బయలుదేరుతుంది. 17480 తిరుపతి - పూరీ ఎక్స్‌ప్రెస్ ఈనెల 10, 11 తేదీల్లో సాయంత్రం 6.25కు వచ్చి 6.26 గంటలకు బయలుదేరుతుంది. 17482 తిరుపతి - బిలాస్‌పూర్ ఈనెల 9న సాయంత్రం 6.25కు వచ్చి 6.26 గంటలకు బయలుదేరుతుంది. 67257 విజయవాడ - నరసాపూర్ 10, 11 తేదీల్లో రాత్రి 8.38కు వచ్చి 8.39 గంటలకు బయలుదేరుతుంది. 67258 మచిలీపట్నం - విజయవాడ ఈనెల 9, 10, 11తేదీల్లో ఉదయం 5.34కు వచ్చి 5.35 గంటలకు బయలుదేరుతుంది.

వల్లూరుపాలెం రోడ్డుకు మరమ్మతులు



వల్లూరుపాలెం-కంకిపాడు రోడ్డులో గోతులను తారుతో పూడుస్తున్న కూలీలు

తోట్లవల్లూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లూరుపాలెం నుంచి కంకిపాడు లాకుల వరకు ఉన్న ఆర్అండ్‌బీ రహదారికి రూ.40 లక్షలతో మరమ్మతులు జరుగుతున్నాయి. కంకిపాడు లాకుల వైపు నుంచి గోతులను తారుతో పూడ్చి రోలర్‌తో చదును చేసుకుంటూ వస్తున్నారు. జనవరి 5న ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ఈ మరమ్మతు పనులకు భూమి పూజ నిర్వహించారు. 6.63 కిలో మీటర్ల పొడవున రహదారిపై గోతులకు తారుతో మరమ్మతులు చేస్తున్నారు. గత వైసీపీ పాలనలో ఈ రహదారికి ఎలాంటి మరమ్మతులు చేయలేదని, గోతులతో ఎన్నో అవస్థలు ఎదుర్కొన్నామని వాహనదారులు చెపుతున్నారు. సింగిల్ రోడ్డు కావటంతో ఎదురుగా బస్సు లేదా లారీ, ఆటో వస్తే తప్పుకోవటానికి మార్జిన్ ఆనవాళ్లు లేకుండా కోతకు గురై ప్రమాద పరిస్థితులను చవిచూశామని, తోట్లవల్లూరు దళితవాడకు చెందిన ఓ యువకుడు గోతుల్లో బైక్ అదుపుతప్పి ప్రాణాలు కోల్పోయిన ఘటనను ప్రజలు గుర్తు చేస్తున్నారు. ముఖ్యంగా కంకిపాడు లాకుల దగ్గర్లో రోడ్డు మార్జిన్ నిర్మించటం రవాణా ఇబ్బందులకు చెక్ పడిందని ఆటో డ్రైవర్లు చెపుతున్నారు.

పాల ప్రాసెసింగ్ ఉత్పత్తుల్లో ప్రథమ స్థానం

- కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని



గొల్లమందలలో రైతులను సన్మానిస్తున్న చలసాని

ఎ.కొండూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పాల పదార్థాల ప్రాసెసింగ్ ఉత్పతుల్లో కృష్ణా మిల్క్ యూనియన్ దేశంలోనే ప్రథమ స్థానంలో ఉన్నట్టు జిల్లా మిల్క్ యూనియన్ ప్రాజెక్టు చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. శనివారం మండలంలోని గొల్లమందల గ్రామంలో యూనియన్ వజ్రోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులకు మెరుగైన యాజమాన్య పద్ధతులు, పశుపోషణ, పాడిరైతులకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టామన్నారు. 1965లో ఉమ్మడి కృష్ణాజిల్లాలో 250 లీటర్లతో ప్రారంభించి మిల్క్ యూనియన్ నేడు రూ. 12కోట్ల లీటర్లకు చేరిందన్నారు. రైతులకు బోనస్‌లు, పశువులకు వైద్యం, ఎక్కువ ధరలు కల్పిస్తోందన్నారు. అనంతరం పాడి రైతులను సన్మానించారు. తిరువూరు క్లస్టర్ మేనేజర్ టి.సాంబమూర్తి, సూపర్‌వైజర్ ప్రసాద్, రామచంద్రరావు, వాణిశ్రీ, సత్యనారాయణ, సుశీలమ్మ, సూరయ్య, వనజ, వెంకట్రామిరెడ్డి, వెంకటేశ్వరావు, సాంబశివరావు పాల్గొన్నారు.

9 కేజీల గంజాయి స్వాధీనం... ఇద్దరిపై కేసు నమోదు

అజిత్‌సింగ్‌నగర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 9 కేజీల గంజాయిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేశారు. స్థానిక భరతమాత కాలనీ 2వ లైన్‌లోని ఓ ఇంట్లో గంజాయి ఉన్నట్టు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. శనివారం మధ్యాహ్నం ఆ ఇంటిపై దాడి చేసిన పోలీసులు 9 కిలోల గంజాయిని గుర్తించారు. ఇంట్లో ఉంటున్న సునీత అనే మహిళను ప్రశ్నించగా స్థానిక సైబిల్ ఆసుపత్రి ఏరియాకి చెందిన నవీన్ అనే యువకుడు తన వద్ద దాచినట్టు చెప్పింది. సునీతతో పాటుగా నవీన్‌ను అదుపులోకి తీసుకున్న అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు ఇద్దరినీ అరెస్ట్ చేశారు.

హెచ్ఆర్ఏ ఇప్పించండి.. ఔట్ సోర్సింగ్ నేతలు



శివారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న సంఘ నేతలు

ధర్నాచౌక్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు హెచ్ఆర్ఏ ఇప్పించాలని ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నేతలు శనివారం ఏపీ ఎన్జీవో జేఏసీ చైర్మన్ శివారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఎన్జీవో ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్ కూడా పాల్గొన్నారు. నేతలను కలిసిన వారిలో నేతలు విజ్జన చినబాబు, పి.మస్తాన్‌రావు, ఎస్.వి.కృష్ణ, ఎస్.ప్రతాప్ కుమార్ ఉన్నారు. హౌసింగ్ కార్పొరేషన్‌లో 19ఏళ్లుగా ఐటీ, మేనేజర్, ఏఈ, ఎంఐఎస్, వర్క్ ఇన్స్పెక్టర్, డీఈవో, అటెండర్ పోస్టుల్లో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తున్నామన్నారు. రాష్ట్ర విభజన తరువాత షీలా బేడీ కమిటీ కేటాయించిన ఖాళీ పోస్టుల్లో తాము పనిచేస్తున్నామన్నారు. నిబంధనల మేరకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ రోస్టర్ ప్రాతిపదికన తాము నియామకమయ్యామన్నారు. సచివాలయ ఉద్యోగాల్లో తమకు వెయిటేజ్ ఇవ్వనందున ఉద్యోగాలకు అర్హత కోల్పోయామన్నారు. కాగా, మెప్మా, సెర్ప్, డ్వామాలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్‌లుగా పనిచేస్తున్న సిబ్బందికి హెచ్ఆర్ఏ పాలసీ అమలు చేస్తున్నారని, అలాగే తమకు కూడా వర్తింపజేయాలని కోరారు.

సునిశిత హాస్యంతో ఆహ్లాదం పంచిన నాటికలు



దంత వేదాంతం నాటికలో ఓ సన్నివేశం

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మనసారా హాయిగా నవ్వుకునేలా సందేశాత్మక, సునిశిత హాస్యంతో రూపొందించబడిన నాటికలు ప్రేక్షకులను ఆహ్లాదపరిచింది. శనివారం సాయంత్రం సిద్ధార్థ కళాపీఠం సౌజన్యంతో సుమధుర కళానికేతన్ 51వ వార్షికోత్సవం పురస్కరించుకొని 27వ తెలుగు హాస్యనాటికల పోటీలు మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో ప్రదర్శించారు. హాస్య సంభాషణ ఉచ్చారణ నటన ద్వారా ప్రేక్షకులను నవ్వించారు. మొదటి ప్రదర్శనగా ఈవీఎస్ కళాసమితి, విజయవాడ వారిచే దంతవేదాం తం నాటిక ప్రదర్శన జరిగింది. ఈ నాటికకు భమిడిపాటి రాధాకృష్ణ చక్కని సంభాషణలు అందించగా, దర్శకుడు ఈ వన రమేష్, బొర్రా నరేన్, కత్తి శ్యాంప్రసాద్, ఎం.నాగరాజు, మల్లేశ్వర పట్నాయక్, భాగ్యరాజ్, జి.సత్యనందిని నటించి హాస్యాన్ని పండించారు. మద్దుకూరి ఆర్ట్ క్రియేషన్స్, చిలకలూరిపేట వారు మా ఇంట్లో మహాభారతం రవీంద్రబాబు రచనను, ఎన్.వెంకటేశ్వరరావు దర్శకత్వంలో ప్రదర్శించారు. నడింపల్లి వెంకటేశ్వరరావు దర్శకత్వం వహించగా, రచయిత మద్దుకూరి రవీంద్రబాబు, ఎస్.జ్యోతిరాణి, డి.శ్రీహరి, పి.పండు, పి.భుజంగరావు, వై.భవానీ నటించారు. చివరిగా భద్రం ఫౌండేషన్ వెల్ఫేర్ సొసైటీ, విశాఖపట్నం వారి టొండూ దొండే నాటికను డేవిడ్ రాజు రచన, దర్శకత్వంలో ప్రదర్శించారు. నాగార్జున విద్యాసంస్థ (కొండపల్లి) వ్యవస్థాపకుడు దేవినేని కిషోర్ కుమార్ మాట్లాడుతూ కనుమరుగవుతున్న కళలను బావితరాలకు అందించాలని సూచించారు. అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు సామంతపూడి వెంకటేశ్వరరాజు, ప్రముఖ హృద్రోగ నిపుణుడు డాక్టర్ ఎ.పూర్ణానందం సందేశాలిచ్చారు. సంస్థ అధ్యక్షుడు సామంతపూడి నరసరాజు సభాధ్యక్షుడిగా వ్యవహరించారు. సభలో ఉన్నత విద్యావంతులు, తమ కళాప్రతిభతో పలువురు మన్ననలు అందుకుంటున్న పి.సాయి శంకర్, బి.రూపాశ్రీలకు శనగల కబీర్ దాస్ స్మారక యువ పురస్కారం అందించి సత్కరించారు.



ప్రజల నుంచి అర్జీలను తీసుకుని వారి సమస్యలను వింటున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

రోజుకు ఒక్క సమస్యనైనా పరిష్కరిస్తా!

- ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రజలు తెలిపే సమస్యల్లో ఇక నుంచి రోజుకొక సమస్య చొప్పున పరిష్కరించాలని నిర్ణయించుకున్నట్టు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శనివారం స్థానిక ప్రజావేదికలో పట్టణాధ్యక్షుడు దింట్యాల రాంబాబు అధ్యక్షతన 1,36,15 వార్డుల్లోని సమస్యలపై ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల మాట్లాడుతూ నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి ప్రతి శనివారం ఒక్కరోజు కేటాయించినట్టు తెలిపారు. ప్రజా ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నేటివరకు పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరాలో లోపాలను సరిచేశామన్నారు. ప్రత్యేకంగా టిడ్కో కాలనీలో చెత్త సేకరణకు డస్టుబిన్‌లను ఏర్పాటు చేశామని, తాగునీటి సమస్యలను కొంతవరకైనా పరిష్కరించేలా అధికారులతో మాట్లాడామన్నారు. మూడేళ్ల క్రితం పాత పంపుల చెరువకు పడిన గండిని పూడ్చడం జరిగిందన్నారు. పట్టణంలో ట్యాంకర్లు లేకుండానే ఇంటింటికీ తాగునీరు అందిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టణ పరిధిలోని రహదారుల అభివృద్ధికి రూ.10కోట్లు మంజూరు చేశారన్నారు. త్వరలోనే రహదారుల పనులు ప్రారంభమవుతాయన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా ప్రజావేదికకు వచ్చి తెలిపాలన్నారు. టీడీపీ నేతలు కంచర్ల సుధాకర్, దాసు శ్యాంకుమార్, కొలుసు రాజా, లోయ శివాజీ పాల్గొన్నారు.

20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయం


- ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజాను గెలిపించాలి
- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్, చిత్రంలో వెంకట్రామ్, శ్రీనివాసరావు

చల్లపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం కృషిచేస్తోందని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. శుక్రవారం సాయంత్రం చల్లపల్లిలోని ఎన్టీఆర్ పార్కులో ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా మండల కూటమి నేతల సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడిగా సమావేశానికి విచ్చేసిన పట్టాభిరామ్ మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో ఉపాధి మార్గాలు కల్పించేందుకు, ఒక్కో ప్రాంతానికి ఒక్కో పరిశ్రమ తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. రూ.ఆరున్నర లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి సాధించామన్నారు. ఇప్పటి వరకు రెండున్నర లక్షల నూతన ఉద్యోగాల సృష్టిస్తున్నట్టు చెప్పారు. కేంద్రంలో పీఎం మోదీ సహకారంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సారథ్యంలో అద్భుతమైన విజయాలు, రాష్ట్రానికి నిధులు సాధించామన్నారు. ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ (రాజా)కు ఘన విజయాన్ని చేకూర్చాలని పిలుపునిచ్చారు. టీడీపీ చల్లపల్లి మండలాధ్యక్షుడు మోర్ల రాంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో యువనేత మండలి వెంకట్రామ్, నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, టీడీపీ జిల్లా నేతలు కొల్లూరి వెంకటేశ్వరరావు, పైడిపాముల కృష్ణకుమారి, చల్లపల్లి డీసీ చైర్మన్ నిడమానూరి దిలీప్‌కుమార్, ఎంపీటీసీలు పైడిపాముల స్వప్న, రాజులపాటి అంకమ్మ, షేక్ నబీషోరి, జనసేన నేతలు బొందలపాటి వీరబాబు, తోట కనకదుర్గ, కూటమి నేతలు పాల్గొన్నారు.

14 నుంచి డ్యాన్స్ ఐకాన్-2 వైల్డ్‌ఫైర్



మాట్లాడుతున్న ఓంకార్, మానస్, యశ్వంత్, దీపిక

లబ్బీపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): డాన్స్ లవర్స్‌ను మైమరపించిన డ్యాన్స్ ఐకాన్ సీజన్-1కు కొనసాగింపుగా డ్యాన్స్ ఐకాన్ సీజన్-2 వైల్డ్‌ఫైర్‌ను ఫిబ్రవరి 14 నుంచి ఆహా ఓటీటీలో ప్రీమియర్‌కు రెడీ అయిందని ప్రముఖ యాంకర్, దర్శకుడు హోస్ట్ ఓంకార్ తెలిపారు. డాన్స్ ఐకాన్ టీం శనివారం నగరంలోని ఒక హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైల్డ్‌ఫైర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తుండటం సంతోషంగా ఉందని, హీరోయిన్ ఫరియా అబ్దుల్లా హోస్ట్‌గా చేస్తుండటం ఆనందంగా ఉందన్నారు. పంచభూతాల్లాంటి ఐదుగురు కంటెస్టెంట్స్ తమ పెర్ఫార్మెన్స్‌తో ప్రేక్షకులను అలరిస్తారన్నారు. ఈ సీజన్‌లో ఎవరు విజేతలో ప్రేక్షకులు తమ ఓటింగ్ ద్వారా నిర్ణయిస్తారని తెలిపారు. ఇది పూర్తిగా ఎంటర్‌టైన్‌మెంట్ అందించే డ్యాన్స్ షో అని తెలిపారు.

భారత బ్యాడ్మింటన్ జట్టు మేనేజర్‌గా అంకమ్మ చౌదరి

విజయవాడ స్పోర్ట్స్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): భారత బ్యాడ్మింటన్ జట్టుకు మేనేజర్‌గా డాక్టర్.పి.అంకమ్మ చౌదరి నియమితులయ్యారు. ఫిబ్రవరి 11 నుంచి 16 వరకు చైనాలో జరిగే ఆసియా మిక్సిడ్ టీమ్ ఛాంపియన్‌షిప్-2025లో పాల్గొనే ఇండియా జట్టుకు అంకమ్మ చౌదరి మేనేజర్‌గా ది బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నామినేట్ చేసింది. ఈ జట్టులో 14 మంది క్రీడాకారులు, నలుగురు కోచ్‌లు, మరో ఇద్దరు సపోర్టింగ్ స్టాఫ్ ఎంపికయ్యారు. క్రీడాకారులు పి.వి. సింధు, లక్ష్యసేన్, సాత్విక్ సాయి రాజ్, గాయత్రి గోపీచంద్, అశ్విని పొన్నప్ప, అర్జున్, డి.కపిలా, సతీష్ కుమార్ ఈ టోర్నమెంట్‌లో పాల్గొననున్నారు. బీఏఐ జనరల్ సెక్రటరీ సంజయ్ మిశ్రా, నేషనల్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ తదితరులు అంకమ్మ చౌదరికి శుభాకాంక్షలు తెలిపారు.



బంగినపల్లి మామిడి ఎగుమతికి సిద్ధమైన రైతులు

బంగినపల్లి మామిడి ఎగుమతులు ప్రారంభం

విస్సన్నపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మధురఫలం బంగినపల్లి మామిడి విస్సన్నపేట నుంచి గుజరాత్, ముంబాయ్ తదితర రాష్ట్రాలకు శనివారం ఎగుమతి అయ్యింది. విస్సన్నపేట ఎమ్ఎస్ఆర్ మ్యాంగో బ్రోయర్స్ కమీషన్ దుకాణం నుంచి రైతులు ఈ ఎగుమతులు ప్రారంభించారు. క్వాలిటీని బట్టి టన్ను రూ.70 నుంచి రూ.90 వేల వరకు ధర పలుకుతుందని దుకాణం నిర్వాహకుడు మోరంపూడి మల్లికార్జునరావు తెలిపారు. టీడీపీ రాష్ట్ర నేత నెక్కలపు వెంకటేశ్వరరావు (బద్దె), రైతులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.ల్లో)

బ్రాయిలర్‌బర్డ్	110, 119, 130
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 475

గుడివాడ-కంకిపాడు రహదారి అభివృద్ధికి పోస్టుకార్డు ఉద్యమం



గుడివాడ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ-కంకిపాడు రహదారిని అభివృద్ధి చేయాలని కోరుతూ బవిష్యత్ భద్రతా దళం సుప్రీంకోర్టులో వేసిన ప్రజావ్యాజ్యంపై వెంటనే విచారణ జరపాలని కోరుతూ శనివారం ఏలూరురోడ్డులో పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. పోస్టు కార్డు ఉద్యమంలో పాల్గొని సంతకాలు చేసిన కార్డులను భద్రతా దళం సభ్యులు జి.పూర్ణచంద్రరావు, యమ్.డి తాహెర్ బాషాలు సేకరిస్తున్నారు. రెండో విడత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికి పోస్టు కార్డులను త్వరలోనే పంపుతామని భద్రతా దళం వ్యవస్థాపకులు వై.వి.మురళీకృష్ణ తెలిపారు.



వరసిద్ధి వినాయక స్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

గుడివాడ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : గుడివాడలో సిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. గణేష్‌నగర్ కాలనీలో జరిగిన త్రిశక్తి త్రిమూర్తి స్వరూప వరసిద్ధి వినాయక స్వామి ఆలయ, విగ్రహ ప్రతిష్ఠలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పాల్గొని దేవతామూర్తుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే వెనిగండ్లను దేవస్థాన కమిటీ పెద్దలు ఘనంగా సత్కరించారు. జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, నాయకులు చేకూరు జగన్మోహనరావు, యక్కలి మణిదీప్, దేవస్థాన కమిటీ అధ్యక్షులు కోటేశ్వరరావు, కార్యదర్శి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళా సమైక్య భవనం శిలాఫలకంతో సరి!

- 18 ఏళ్ల క్రితం రూ.3 లక్షలతో శంకుస్థాపన
- నేటికి కార్యరూపం దాల్చని వైనం
- పాత హాస్టల్ భవనంలో వర్షానికి తడుస్తూ సమావేశాలు
- శ్లాబు ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి

(ఆంధ్రజ్యోతి-తోట్లవల్లూరు)

మండల మహిళా సమైక్య భవనం (స్త్రీ శక్తి భవనం) నిర్మాణం కలగా మిగిలిపోయింది. 920 డ్వాక్రా గ్రూపులు కలిగి 9,725 మంది మహిళలు సభ్యులు కలిగి ఉన్నప్పటికీ స్త్రీ శక్తి భవనం కోసం దశాబ్దాలుగా ఎదురు చూడాల్సి వస్తోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో దాదాపు అన్ని మండలాల్లో స్త్రీ శక్తి భవనాలను నిర్మించగా తోట్లవల్లూరులో శంకుస్థాపన చేసి 18 సంవత్సరాలుగా అలాగే వదిలేశారని మహిళలు చెపుతున్నారు. తోట్లవల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో 2007 సెప్టెంబరు 26వ తేదీన నాటి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉయ్యూరు ఎమ్మెల్యేగా ఉన్న ప్రస్తుత మంత్రి కొలుసు పార్థసారథి ఏసీడీపీ నిధులు రూ.3 లక్షలు కేటాయించి, నాటి పశుసంవర్థక, మత్స్యశాఖ మంత్రి మండలి బుద్ధ ప్రసాద్‌తో శంకుస్థాపన చేయించారు. ప్రైవేటు భవనంలో అద్దెకు మహిళా సమైక్య కార్యాలయం ఏర్పాటు చేసి విధులు నిర్వర్తించారు. ఆ తర్వాత హాస్టల్‌కు మార్చారు.

హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరటంతో శ్లాబు బలహీనపడి వర్షానికి పెచ్చులూడిపడుతున్నాయని డ్వాక్రా మహిళలు చెపుతున్నారు. ఈ భవనం లో మహిళలతో సమావేశాలు జరపటం ప్రమాదకరంగా ఉంటోందని, భయంతోనే కూర్చుంటామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్త్రీ శక్తి భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పాత భవనంలో మహిళా సమైక్య కార్యాలయం నిర్వహిస్తున్నామని, ఇక్కడ ఇబ్బందికరంగా ఉంటోందని మండల వెలుగు ఏపీఎం సాంబశివరావు తెలిపారు. స్త్రీ శక్తి భవనం నిర్మించాలని అధికారులకు సూచించామన్నారు.





తోట్లవల్లూరులో పాత హాస్టల్ భవనంలో కొనసాగుతున్న మండల మహిళా సమాఖ్య కార్యాలయం.. మండల కార్యాలయం ఆవరణలో 2007లో మహిళా సమాఖ్య భవనానికి చేసిన శంకుస్థాపన శిలాఫలకం

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

గుడివాడ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : జన్మదిన వేడుక ఎటువంటి ఆడంబరాలకు పోకుండా వృద్ధుల మధ్య చేసుకోవడం అభినందనీయమని బీజేపీ టూటౌన్ అధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ(ఆర్‌కె) అన్నారు. బేతవోలులోని శాంతి వృద్ధాశ్రమంలో శాంతి వృద్ధాశ్రమం, మండపాదులోని నిరాశ్రయుల కేంద్రంలో చిన్నారి లిషిత పుట్టినరోజు సందర్భంగా పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. లంకా రాంబాబు, లిషిత కుటుంబ సభ్యులు, వృద్ధులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పునఃపరిశీలన రేపటి నుంచి

పామర్రు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి) : మండలంలో ఎన్టీఆర్ భరోసా పునఃపరిశీలన ఈనెల 10 నుంచి జరుగుతుందని ఎంపీడీవో కె.జ్యోతి శనివారం తెలిపారు. మొత్తం 43 మంది దివ్యాంగుల పింఛన్లను ప్రత్యేక బృందం పరిశీలిస్తుందన్నారు. లబ్ధిదారులు వారి ఇంటి వద్ద ఉండి ప్రత్యేక బృందానికి సహకరించాలని కోరారు.

నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయండి

ఈనెల 10న జరిగే జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు విద్యార్థులు, చిన్నారుల తల్లిదండ్రులు సహకరించాలని కనుమూరు పీహెచ్‌సీ డాక్టర్ డి.రాజేష్ కోరారు. అన్ని అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో నులిపురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రల పంపిణీ జరుగుతుందన్నారు.

జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో చాంపియన్ శ్రీకాంత్



బంగారు పతకం అందుకున్న శ్రీకాంత్

గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో గుడ్లవల్లేరు నీలకంఠేశ్వరపురం మండల పరిషత్ పాఠశాల ఉపాధ్యాయుడు కె.ఎల్.శ్రీకాంత్ చాంపియన్ షిప్ సాధించారు. రాజస్థాన్‌లో జరిగిన 44వ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో శ్రీనాథ్ పాల్గొని హేమర్ త్రో, డిస్క్ త్రోల్లో బంగారు పతకం, షాట్‌పుట్, 400 మీటర్ల రిలే పరుగులో కాంస్య పతకాలను సాధించి చాంపియన్ షిప్ సాధించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌ను పలువురు అభినందించారు.

భగత్‌సింగ్ బ్లడ్ డోనర్స్ ఆధ్వర్యంలో రక్తదానం



గుడివాడ, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి) : విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణి వాసంతికి అత్యవసరంగా ఆపరేషన్ నిమిత్తం రక్తం అవసరం కావడంతో భగత్‌సింగ్ బ్లడ్ డోనర్స్ ప్రతినిధి రేపాని కొండ శనివారం గుడివాడ నుంచి విజయవాడ వెళ్లి రక్తదానం చేశారు. రక్తదాత కొండను పలువురు అభినందించారు. ఇప్పటికే 33 సార్లు రక్తదానం చేసినట్లు కొండ తెలిపారు.

భావనారుషి ఆలయం ప్రారంభోత్సవం



గూడూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : మల్లవోలులో భావనారుషి భద్రావతి దేవి నూతన ఆలయ ప్రారంభోత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

గుడివాడలో బీజేపీ సంబరాలు



సంబరాలు చేసుకుంటున్న బీజేపీ శ్రేణులు

గుడివాడ, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి) : మూడు దశాబ్దాల తర్వాత ఢిల్లీలో బీజేపీ జెండా రెపరెపలాడిందని, ప్రధాని మోదీ పని తీరుకు ఇదే నిదర్శనమని బీజేపీ నేత రామినేని వెంకటకృష్ణ అన్నారు. ఢిల్లీ శాసనసభ ఎన్నికల్లో బీజేపీ భారీ గెలుపు నేపథ్యంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు ఆధ్వర్యంలో శనివారం నెహ్రూచౌక్ సెంటర్‌లో విజయోత్సవం జరిపారు. బీజేపీ పట్టణ అధ్యక్షులు కౌడి ప్రసాద్, మాచర్ల రామకృష్ణ, నాయకులు అంగడాల సతీష్, శలంకాయల లీలాకుమారి, యర్రపోతు అర్జున్, వాసుపల్లి రాంప్రసాద్, శీలం శంకరరావు, మేక శ్రీను, నల్లబోయిన మోహన్, చందు ఆంజనేయులు, వెంకటేశ్వరరావు, పద్మావతి, లక్ష్మీ పాల్గొన్నారు.

రుద్రపాక జడ్పీ విద్యార్థుల ప్రతిభ



గ్రిగ్‌పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నందివాడ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : గ్రిగ్ మెమోరియల్ బాలుర సబ్ జోన్ ఆటల పోటీల్లో రుద్రపాక పిన్నమనేని వీరయ్య చౌదరి స్మారక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభను చాటారు. బాలుర సీనియర్స్ వాలీబాల్ విభాగంలో రన్నర్స్, టెన్నికాయిట్‌లో రన్నర్స్, కబడ్డీ విన్నర్స్, బాలుర జూనియర్ విభాగం కబడ్డీలో విన్నర్స్‌గా నిలిచారు. విజేతలను శనివారం ప్రధానోపాధ్యాయుడు సిహెచ్.సూర్యారావు, వ్యాయామోపాధ్యాయుడు ఎం.శివకుమార్ విద్యార్థులకు బహుమతులు అందించి అభినందించారు. మాజీ సర్పంచ్ పొలిమెట్ల మరియదాసు కుమారుడు, రాంకీ సంస్థ సీఈవో పొలిమెట్ల రవి ప్రసాద్ పాఠశాలకు శాశ్వత మంచినీటి సౌకర్యార్థం సుమారు రూ.4 లక్షలు విలువ చేసే అత్యాధునిక వాటర్ ప్లాంట్‌ను బహూకరిస్తానని హెచ్‌ఎం సుబ్బారావుకు తెలిపారు. ఉపాధ్యాయులు ఆర్.వి.ఎల్.నరసింహారావు, రత్న ప్రకాష్, బి.లలిత కుమారి, అనురాధ, వరప్రసాద్, నాగరాజు, రంగిశెట్టి నాగేశ్వరమ్మ, గోపి, పవన్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు



స్వామిని దర్శించుకుని భక్తులతో మాట్లాడుతున్న రావి వెంకటేశ్వరరావు

గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : భీష్మ ఏకాదశ పర్వదినాన్ని పురస్కరించుకొని రమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో శనివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాల ను నిర్వహించారు. దాదాపు 270 మంది దంపతులు వ్రతాలు ఆచరించారు. దాదాపు ఆరు వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకొన్నారు. సత్యదేవుని దర్శించుకొన్న ప్రముఖుల్లో రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, మండల టీడీపీ అధ్యక్షుడు కొసరాజు బాపయ్య చౌదరి, గుడివాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వల్లభనేని వెంకట్రావు, పోలవరపు వెంకటరావు, ఎ.రామ్మోహనరావు, వల్లభనేని వెంకసుబ్బారావు చౌదరి, రంగబాబు, కె.రవి, చిలంకుర్తి వెంకటేష్, కె.హరికృష్ణ, మురాల నరేష్, సనకా నాని, సింగంసెట్టి ఆదినారాయణ, ఎస్.వి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణ స్వామి దేవస్థానంలో..



సామూహిక సత్యనారాయణ వ్రతాలు చేస్తున్న భక్తులు

గుడివాడ : కోతిబొమ్మ సెంటర్‌ని రమా సహిత సత్యనారాయణ స్వామి దేవస్థానంలో భీష్మ ఏకాదశి సందర్భంగా శనివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహించారు. వేద పండితులు వల్లూరి రామకృష్ణమాచార్యులు, సాతులూరి అనిల్‌కుమార్ విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి వెన్నతో విశేష అలంకారం చేశారు. 600 మంది దంపతులు వ్రతాలు నిర్వహించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ గుదే లక్ష్మీ రంగనాయకమ్మ, దేవస్థానం కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అష్టలక్ష్మి ఆలయంలో విశేషపూజలు



అష్టలక్ష్మి ఆలయంలో కలశపూజ

గుడివాడ రూరల్ : చినఎరుకపాడు లోని అష్టలక్ష్మీ దేవాలయం గణపతి సచ్చిదానంద జ్ఞానబోధ సభ ట్రస్ట్ ఆధ్వర్యంలో విశేషపూజలు జరిపారు. ఆలయ 13వ వార్షికోత్సవం సందర్భంగా ఉదయం మండపారాధన, 108 కలశాలతో పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, 10 గంటలకు లోకకళ్యాణార్థం శ్రీలక్ష్మీనారాయణ స్వామి శాంతి కల్యాణం నిర్వహించారు. 400 మందికి అన్నసమారాధన జరిగింది.

వీరబ్రహ్మేంద్రస్వామి గ్రామోత్సవం



చల్లపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి గ్రామోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. కల్యాణం పూర్తి చేసుకున్న ఉత్సవ విగ్రహమూర్తులకు శనివారం గ్రామోత్సవం నిర్వహించారు. మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో రెండు రోజులపాటు దిగ్విజయంగా జరిగిన కల్యాణోత్సవాలు శనివారంతో ముగిశాయి. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు శామీరుపేట సాయిబాబు, నడకుదురు లీలా బ్రహ్మేంద్ర, కోశాధికారి కేశనకుర్తి శరత్ బాబు, అడ్డాడ ప్రసాద్ బాబు, వెంకటేశ్వరరావు, డోలా శ్రీనివాసరావు, నాగబ్రహ్మచారి, సుబ్బయ్య, నాగరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మేఘా గ్యాస్ పైప్‌లైన్ లీకుతో మంటలు

- టీడీపీ నేత కొసరాజు చొరవతో సిబ్బంది అప్రమత్తం
- మంటలు ఆర్పివేత ● తప్పిన ప్రమాదం

గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): గుడ్లవల్లేరు నెహ్రూ నగర్ అంగన్వాడీ కేంద్రం సమీపంలో మేఘా ఇంజనీరింగ్ గ్యాస్ పైప్‌లేన్ లీకేజీ కారణంగా శనివారం మధ్యాహ్నం 12గంటల సమయంలో మంటలు చెలరేగాయి. పెద్ద శబ్దంతో గ్యాస్ లీకై పెద్ద మంటలు రావడంతో మండల టీడీపీ అధ్యక్షుడు కొసరాజు బాపయ్య చౌదరి, స్థానికులు గ్యాస్ కంపెనీ స్థానిక కార్యాలయ సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకొని మంటలు అదుపుచేశారు. గ్యాస్ పైప్‌లైన్‌కు మరమ్మతులు చేశారు. దీంతో ఈ ప్రాంత ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

రోడ్డు మీదే కంకర, ఇసుక!

- రెండు నెలలుగా ఇబ్బంది పడుతున్న వెంకటరామాపురం గ్రామస్థులు
- తరచూ ప్రమాదాలు ● తక్షణం తొలగించాలని వేడుకోలు



రోడ్డుపై ప్రమాదకరంగా ఇసుక


నందివాడ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు మీద ఇసుక, కంకరు తొలగించాలని వెంకట రామాపురం గ్రామస్థులు అధికారులను కోరుతున్నారు. గ్రామానికి చెందిన మెరుగుమాల లక్ష్మణరావు మాట్లాడుతూ గత రెండు నెలలుగా పంచాయతీ ఫిల్టర్ బెడ్ల రిపేర్లకు కూటమి ప్రభుత్వం గ్రాంటు విడుదల చేసిందన్నారు. వెంకటరామాపురంలో పంచాయతీ ఫిల్టర్ బెడ్ల మరమ్మతుల కోసం ఇసుక రోడ్డు మీద వేసి కాంట్రాక్టుదారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. నిత్యం వందల సంఖ్యలో రోడ్డుపై వాహనాలు తిరుగుతుండడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. సంబంధిత అధికారులు రోడ్డు మీద వేసిన ఇసుక, కంకరు తొలగించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఏసీ, సోలార్ టెక్నీషియన్, ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో శిక్షణ

ఉంగుటూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆత్కూరు స్వర్ణభారత్‌ట్రస్ట్‌లోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ నైపుణ్య శిక్షణా కేంద్రంలో, నిరుద్యోగ యువకులకు స్వయం ఉపాధి కల్పించే పలు వృత్తి నైపుణ్య కోర్సుల్లో ఈ నెల 12నుంచి ఉచిత శిక్షణా తరగతులు ప్రారంభిస్తున్నట్లు స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఏసీ టెక్నీషియన్, సోలార్ టెక్నీషియన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ పొందేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవచ్చుని తెలిపారు. వివరాలకు 966642 2627(ఎలక్ట్రీషియన్), 9492787399(ఏసీ టెక్నీషియన్), 8309031720(సోలార్ టెక్నీషియన్), నెంబర్లలో సంప్రదించాలని దీపా వెంకట్ పేర్కొన్నారు.

నేడు టీడీపీలో చేరనున్న కంకిపాడు సర్పంచ్, ఉప సర్పంచ్

కంకిపాడు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ, ఎమ్మెల్యే బోడె ప్రసాద్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై తెలుగు దేశం పార్టీలో చేరుతున్నామని కంకిపాడు ఉప సర్పంచ్ రాచూరి చిరంజీవి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ, ఆదివారం సాయంత్రం సర్పంచ్ బాకి రమణతో పాటు ఐదుగురు వార్డు సభ్యులు, పలువురు వైసీపీ నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో వైసీపీ పని అయిపోయిందన్నారు.



రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

పెడన, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : పెడన - గుడివాడ రూట్‌లో పైడమ్మ లే అవుట్ సమీపంలో శుక్రవారం రాత్రి రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు పెడన 16వ వార్డుకు చెందిన రౌతుల రమేష్ (39)గా పోలీసులు గుర్తించారు. హోటల్ కార్మికుడైన రమేష్ అప్పుల బాధ తాళలేక శుక్రవారం రాత్రి మచిలీపట్నం నుంచి విజయవాడ వెళుతున్న ప్యాసింజర్ రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు. మచిలీపట్నం రైల్వే పోలీసు స్టేషన్ ఇన్‌చార్జి ఏ.ఎస్.కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 119, 130
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్ల ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475


బచ్చుపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు


హంసలదీవి వేణుగోపాలస్వామి ఆలయంలో సామూహిక సత్య వ్రతాలు

సామూహిక సత్యవ్రతాలు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : భీష్మ ఏకాదశి సందర్భంగా బచ్చుపేటలో వేంచేసియున్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో సామూహిక వేంకటేశ్వరస్వామి వ్రతాలు జరిగాయి. వేంకటేశ్వర భక్త సంఘం అధ్యక్షుడు కొమరగిరి చంద్రశేఖర్, హిమబిందు దంపతులు మంటపారాధన నిర్వహించారు. సంఘం కార్యదర్శి కె.ఎల్.ఎన్. ఆచార్యులు, పోతుకూచి ఆంజనేయకుమార్, ఆలయ కార్యనిర్వహణాధికారి సమ్మెట ఆంజనేయ స్వామి, వెంకటేశ్వర గుప్తా, సోమయ్య తదితరులు పర్యవేక్షించారు. **బంటుమిల్లి :** భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని బంటుమిల్లి రామాలయంలో శనివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. స్వామి వ్రతం అనంతరం అన్న సమారాధన జరిగింది. **కోడూరు :** భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని హంసలదీవి రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి సన్నిధి లో విశ్వశాంతి యాగ కమిటీ అధ్యక్షుడు మోపిదేవి చక్రవర్తి ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు జరిగాయి. టీటీడీ వేద పాఠశాల విద్యార్థుల మంత్రోచ్ఛరణ మధ్య 800 మంది దంపతులు సత్యదేవుని వ్రతాలు ఆచరించారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది. మండలి వెంకట్రామ్, కనపర్తి శ్రీనివాసరావు సామూహిక సత్యనారాయణ ప్రత్యేక పూజలు చేసి రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామిని దర్శించుకున్నారు. ఏర్పాట్లను బూరగడ్డ రామమోహన్ గాంధీ, మద్దాలి ప్రసాద్, తూనుగుంట్ల వెంకట మహేష్ పర్యవేక్షించారు. **అవనిగడ్డ :** భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం లక్ష్మీనారాయణ స్వామి ఆలయ ఆవరణలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు వైభవంగా జరిగాయి. దాదాపు 50 మంది దంపతులు అర్చక స్వామి దీవి నరసింహమూర్తి నేతృత్వంలో వ్రతాలను ఆచరించారు. దంపతులకు ధర్మకర్త పోతరాజు భాస్కరరావు - అన్నపూర్ణ దంపతులు ఉచితంగా పూజా సామగ్రి అందించారు. ఆలయ అధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. **అవనిగడ్డ రూరల్ :** సంతాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భీష్మఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు దీవి కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు, అలంకారాలు చేశారు. మొవ్వ రఘుశేఖర ప్రసాద్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు విష్ణుసహస్ర నామ పారాయణ నిర్వహించారు.



భావనారుషి ఆలయం ప్రారంభోత్సవం

గూడూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : మల్లవోలులో భావనారుషి భద్రావతి దేవి నూతన ఆలయ ప్రారంభోత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

రచయిత సూర్యనారాయణకు జాతీయ స్థాయి గౌరవం



అవనిగడ్డ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : బందలాయిచెరువ గ్రామానికి చెందిన కవి, రచయిత జి.సూర్యనారాయణ రచించిన గోరువెచ్చని సూరీడు కవితా సంపుటికి జాతీయ స్థాయి గౌరవం లభించింది.

చిత్తూరు జిల్లాకు చెందిన కొనిరెడ్డి ఫౌండేషన్, చదువుల సాహిత్య కళావేదిక 2024 సంవత్సరంలో కవులు, రచయితల నుంచి కవితా సంపుటాలను ఆహ్వానించగా, వివిధ రాష్ట్రాల నుంచి 81 కవితా సంపుటాలు వచ్చాయి. జి.సూర్యనారాయణ రచించిన గోరువెచ్చని సూరీడు కవితా సంపుటికి గౌరవ సత్కారం ప్రకటించినట్లు నిర్వాహకులు డి.కె.చదువుల బాబు శనివారం సూర్యనారాయణకు సమాచారం అందించారు. సూర్యనారాయణకు పలువురు సాహితీ మిత్రులు, రాజకీయ నాయకులు, అధికారులు అభినందనలు తెలిపారు.

జంగిల్ క్లియరెన్స్

అవనిగడ్డ రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : పులిగడ్డ గ్రామపంచాయతీ పరిధిలో జంక్షన్ వద్ద పోలీసు అవుట్ పోస్టు ప్రక్కన ముళ్ల చెట్లు భారీగా పెరగటంతో వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. అవనిగడ్డ సీఐ యువకుమార్ స్పందించి జంగిల్ క్లియరెన్స్ పనులు చేయించాలని సూచించారు. సీఐ ఆదేశాలను పాటిస్తూ సర్పంచ్ దాసరి విజయకుమార్ జంగిల్ క్లియరెన్స్ పనులను చేపట్టారు. దగ్గరుండి మరీ జంగిల్ క్లియరెన్స్ చేయిస్తున్నారు.

మూగజీవికి కార్మికుడి సపర్యలు

అవనిగడ్డ రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : గాయపడిన కుక్కకు సపర్యలు చేసి గొప్పమనస్సును చాటుకున్నాడు అవనిగడ్డ ఇండోర్ స్టేడియం వద్ద తాళాలు బాగు కార్మికుడు. కుక్కకు గాయాలు గమనించిన సదరు కార్మికుడు గాయాలకు మందు రాసి, సపర్యలు చేయ డంతో పలువురు అభినందించారు.

కు.ని.ఆపరేషన్లకు పెడన కుక్కల తరలింపు

పెడన, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : కమిషనర్ మన్నం గోపాలరావు పర్యవేక్షణలో విజయవాడలోని నవోదయ పెట్ సొసైటీ యువకులు రెండు బృందాలుగా బంటుమిల్లి రోడ్డు, మఠం రోడ్డు తదితర ప్రాంతాలలో సం చరిస్తున్న 42 కుక్కలను పట్టుకుని, వాటిని రెండు వ్యానుల్లో ఎక్కించుకుని విజయవాడ తీసుకువెళ్లారు. వీటికి విజయవాడలో కు.ని ఆపరేషన్లు చేసిన అనంతరం తీసుకువచ్చి తిరిగి పట్టణంలో వదులుతారు. కమిషనర్ ఎం. గోపాలరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ హరికిషోర్, శానిటరీ సెక్రటరీలు, మేస్త్రీలు పాల్గొన్నారు.

నేత్ర వైద్యశిబిరం 12న

మచిలీపట్నం ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : కొల్లు ఫౌండేషన్, ఫీనిక్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 12 వ తేదీన ఉదయం 9 గంటల నుంచి మచిలీపట్నం లలిత కన్వెన్షన్ హాలులో శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యం నిర్వహించనున్నట్లు కొల్లు ఫౌండేషన్ అధ్యక్షురాలు కొల్లు నీలిమ తెలిపారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

సారా రవాణా చేస్తున్న ఇద్దరి అరెస్టు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : బందరు మండలం తాళ్లపాలెం గ్రామంలో అక్రమంగా నాటుసారా రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ ఎన్ ఫోర్స్‌మెంట్ సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు. కాకినాడ నుంచి ఆటోలో వస్తున్న ఇద్దరు వ్యక్తులను తనిఖీ చేయగా వారి వద్ద 70 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజేంద్రప్రసాద్ విజయానికి కృషి చేయండి

ఘంటసాల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా కూటమి బలపర్చిన ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గెలిపించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు పేర్కొన్నారు. కొడాలి ప్రసన్నాంజనేయస్వామి కల్యాణ మండపంలో శనివారం కూటమి నేతలతో కలసి సమావేశాన్ని నిర్వహించారు.

జనసేన పార్టీ నాయకులు మండలి వెంకట్రామ్ మాట్లాడుతూ ఓటు ఉన్న ప్రతి వ్యక్తిని కలసి ఓట్లు అడగాల్సిన బాధ్యత మనందరిపైన ఉందన్నారు. కొడాలిలో యెండూరి ఈశ్వర్ మణికంఠ, దుర్గా ప్రసాద్ ఇంటికి వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. కూటమి నేతలు తుమ్మల చౌదరిబాబు, పరుచూరి సుభాష్ చంద్రబోస్, కొల్లూరి వెంకటేశ్వరరావు, గొర్రెపాటి వెంకట రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు సిద్ధినేని కుమార్ రాజా, తాడికొండ వెంకటేశ్వరరావు, శ్రీకాకుళం డీసీ చైర్మన్ అయినపూడి బాను ప్రకాష్, వేమూరి సాయి వెంకట రమణ, పరిశె చలపతి, సర్పంచ్‌లు బెల్లంకొండ అమలేశ్వరరావు, అంకం మారుతీరావు, ముప్పనేని రవిప్రసాద్, బండి పరాత్పరరావు, అత్తులూరి గోపిచంద్, తుమ్మల శంకరరావు, కంఠమనేని గోపి, కుంపటి సుబ్బారావు, కుంపటి చిట్టిబాబు, కొడాలి లక్ష్మణ్, గుత్తికొండ వరప్రసాద్, సుగ్గన పవన్ కుమార్ అవుల దర్మ వెంకట నరసయ్య పాల్గొన్నారు.


ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ కొడాలిలో ఎమ్మెల్సీ ఎన్నిక ప్రచారం చేస్తున్న కూటమి నాయకులు


పూడ్చివేసిన చెరువును చూపుతున్న రజక సంఘం నేతలు

చెరువు పూడ్చివేతపై రజక సంఘం నాయకులు ఆగ్రహం

మోపిదేవి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : పెదప్రోలు గ్రామపంచాయతీకి చెందిన చెరువును పూడ్చివేసిన వ్యక్తులపై చర్యలు తీసుకుని సర్వే చేసి రజక వృత్తిదారులకు అప్పగించాలని రజక వృత్తిదారుల సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి మున్నూరు భాస్కరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరెడ్డయ్య డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్యాలయం పక్కనే ఉన్న రజకుల చెరువును 5, 6, 7 తేదీల్లో అర్ధరాత్రి సమయాల్లో పూడ్చివేయటంపై శనివారం రజక వృత్తిదారుల సంఘం నాయకులు స్థానికులతో కలసి పరిశీలించారు. చెరువును పూడ్చివేస్తున్నప్పటికీ పంచాయతీ మౌనంగా ఉండటం పలు అనుమానాలు తావిస్తోందని ఆరోపించారు. చర్యలు తీసుకునే వరకు రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామన్నారు. రజక వృత్తిదారుల సంఘం నియోజకవర్గ అధ్యక్షులు అవనిగడ్డ రజనీకాంత్, కళ్లేపల్లి లక్ష్మీ, గ్రామానికి చెందిన రజక వృత్తిదారులు పాల్గొన్నారు.



వీరబ్రహ్మేంద్రస్వామి గ్రామోత్సవం

చల్లపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి గ్రామోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. కల్యాణం పూర్తి చేసుకున్న ఉత్సవ విగ్రహమూర్తులకు శనివారం గ్రామోత్సవం నిర్వహించారు. మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో రెండు రోజులపాటు దిగ్విజయంగా జరిగిన కల్యాణోత్సవాలు శనివారంతో ముగిశాయి. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు శామీరుపేట సాయిబాబు, నడకుదురు లీలా బ్రహ్మం ద్ర, కోశాధికారి కేశనకుర్తి శరత్ బాబు, అడ్డాడ ప్రసాద్ బాబు, వెంకటేశ్వరరావు, డోలా శ్రీనివాసరావు, నాగబ్రహ్మాచారి, సుబ్బయ్య, నాగరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.


తేనెటీగల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న మూర్తి

తేనెటీగల పెంపకంతో స్వయం ఉపాధి

అవనిగడ్డ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : తేనెటీగల పెంపకంతో మహిళలు తక్కువ పెట్టుబడితో స్వయం ఉపాధిని పొందవచ్చునని కృషి విజ్ఞాన కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ మూర్తి అన్నారు. తేనెటీగల పెంపకంపై స్థానిక మానేపల్లి వెంకటేశ్వరరావు భవనంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పది పెట్టెల తేనెటీగల పెంపకం ద్వారా ఎలా మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించవచ్చో వివరించారు. పి.వి. రావు మాట్లాడుతూ ఐదువ తేనె టీగల ద్వారా సంవత్సరానికి ఐదు నుంచి 13 కిలోల తేనెను ఉత్పత్తి చేయవచ్చునని, వీటితోపాటు రూ.5 వేల విలువ చేసే మాస్కు, స్మోకర్ తదితర పరికరాలు అందిస్తామన్నారు. సప్తగిరి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ కె.వినయ్, గ్రామ కార్యదర్శి బి.అనిత, మహిళా సొసైటీ అధ్యక్షురాలు కోటేశ్వరమ్మ, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



తూడు తొలగింపు

బంటుమిల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ఆదేశాల మేరకు చెరువులకు నీటిని నింపే కార్యక్రమాన్ని చేపట్టారు. అర్తమూరు గ్రామంలోని వసంతరాయలకోడులో తూడు, పిచ్చి మొక్కలు పేరుకు పోవడంతో డీసీ చైర్మన్ కాశీ ఆధ్వర్యంలో పూడికతీత పనులు ప్రారంభించారు. రైతులు, ఉపాధి హామీ పథకం కూలీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా దొంతులమ్మ బ్రహ్మోత్సవాలు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం ఉల్లింగిపాలెంలో వేంచేసియున్న దొంతులమ్మ అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా జరిగాయి. అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. మహిళా కళాకారిణిలు ఆలపించిన భక్తి గీతాలు ప్రేక్షకులను అలరించాయి.

ప్రేరణ తరగతులను సద్వినియోగం చేసుకోండి

అవనిగడ్డ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : బీసీ సంక్షేమ శాఖ నిర్వహిస్తున్న ప్రేరణ తరగతులను సద్వినియోగం చేసుకుని పదో తరగతి విద్యార్థులు విజయం సాధించాలని బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ రమేష్ సూచించారు.అవనిగడ్డ బీసీ సంక్షేమశాఖ వసతిగృహంలో విద్యార్థులకు ప్రేరణ తరగతులను నిర్వహించి పదవ తరగతి పరీక్షల్లో విజయం సాధించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సబ్జెక్టుల వారీగా అవగాహన కల్పించారు. సహాయ సంక్షేమ అధికారి ఏ.దివ్య


పర్యాటకులకు సూచనలు చేస్తున్న ఎస్సై మాధురి

సముద్రతీరంలో జాగ్రత్తలు పాటించాలి

కోడూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : హంసలదీవి వద్ద సముద్రంలో స్నానాలు చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని మెరైన్ ఎస్సై మాధురి తెలిపారు. హంసలదీవి బీచ్ వద్దకు వచ్చిన పర్యాటకులకు స్నానాలు చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మెరైన్ పోలీసు వారి సూచనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. సముద్రతీరం వెంబడి మెరైన్ సిబ్బంది గస్తీ నిర్వహించారు.

మహిళను దూషించిన మెకానిక్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : హైనీ హైస్కూలు స్వీపర్‌ను కులంపేరుతో దూషించిన మెకానిక్‌పై డీఎస్పీ రాజా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. కంభంపాటి జ్యోత్స్న రాణి, ఆమె భర్త జేమ్స్ హైనీ హైస్కూలులో స్వీపర్లుగా పనిచేస్తున్నారు. స్కూలు వద్ద జ్యోత్స్నరాణి బిస్కట్లు, పెన్నుల అమ్ముతున్నారు. హైస్కూలు ఎదురుగా మెకానిక్ షాపు నడుపుతున్న వీరబాబు గురువారం పాఠశాల కరెస్పాండెంట్ గ్లోరీతో ఘర్షణకు దిగాడు. అంతటితో ఆగక హైస్కూలు ప్రాంగణంలో ఉన్న జ్యోత్స్నరాణి షాపుపై దాడికి దిగాడు. షాపులోని వస్తువులను చెల్లాచెదురు చేశాడు. జ్యోత్స్నరాణిని దుర్భాషలాడాడు. కులం పేరుతో దూషించాడు. దీంతో బాధితురాలు చిలకలపూడి పోలీసులకు ఫిర్యాది చేశారు. సీఐ నబీ , డీఎస్పీ రాజా విచారణ జరిపారు. నిందితుడు వీరబాబుపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుచేశారు.

ఢిల్లీలో విజయం..బీజేపీ శ్రేణుల సంబరాలు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయదుందుభి మోగించిన సందర్భంగా బందరులో పార్టీ శ్రేణులు స్వీట్లు పంచారు. పంతం వెంకట గజేంద్రరావు, సోడిశెట్టి బాలాజీ, కూనపరెడ్డి శ్రీనివాసరావు, తోట రంగనాథ్, చలమలశెట్టి రామకృష్ణ, బి. రాధా, వన్నెంరెడ్డి ప్రసన్నకుమార్, కంబాల శంకరబాబు, నరహరిశెట్టి ప్రసాద్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు. ముడా కార్యాలయంలో ముడా చైర్మన్ మట్టా ప్రసాద్‌కు బీజేపీ రాష్ట్ర నాయకుడు పంతం వెంకట గజేంద్రరావు స్వీట్లు పంచారు. **బంటుమిల్లి :** మండల పార్టీ అధ్యక్షుడుజల్దారి కిరణ్ గుప్తా ఆధ్వర్యంలో టపాసులు పేల్చి స్వీట్లు పంచారు. మాగంటి గంగరాజు, మురాల వెంకటేశ్వరరావు, వల్లభు రంగయ్య, ఏకుల మహేష్‌బాబు, తాడిశెట్టి రామారావు, నరేష్, కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు. **అవనిగడ్డ :** అవనిగడ్డలో పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. మండల పార్టీ అధ్యక్షురాలు విజయలక్ష్మి నేతృత్వంలో మిఠాయిలు పంచారు. వెంకటగిరి, రాంప్రసాద్, బాలకృష్ణ, మురళీకృష్ణ, సనకా రామలక్ష్మి, బచ్చు వెంకటలక్ష్మి, కమ్మిలి ఇందిరా, బచ్చు పార్వతీ పాల్గొన్నారు.

స్థానికంగానే ఉద్యోగాలు కల్పించాలి

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : యువతకు స్థానికంగానే ఉద్యోగావకాశాలు కల్పించే విధంగా యూనిట్లు నెలకొల్పాలని అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ (ఆప్త) వ్యవస్థాపక అధ్యక్షుడు సమ్మెట ప్రసాద్ పిలుపునిచ్చారు. రఘుపతి వెంకటరత్నం నాయుడు విగ్రహానికి శనివారం నివాళులర్పించారు. ప్రసాద్ మాట్లాడుతూ, కొంతమంది అక్రమ వలసదారులను ట్రంప్ ప్రభుత్వం స్వదేశాలకు పంపుతోందన్నారు. దీనిపై యువత ఆందోళన చెందనక్కరలేదన్నారు. ఢిల్లీ ఆంధ్ర అసోసియేషన్ అధ్యక్షుడు చక్రపాణి, అంబటి పాపారావు న్యాయవాదులు సోడిశెట్టి బాలాజీ, లంకిశెట్టి బాలాజీ, మండల దుర్గాప్రసాద్, మాదివాడ వెంకట నరసింహారావు, విశ్రాంత లెక్చరర్ నవరం వెంకటేశ్వరరావు, బడే ప్రభాకరరావు పాల్గొన్నారు.

